
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 28 మార్చి 2025

ఇక మిగిలింది నాలుగురోజులే.... రేషన్‌కార్డుదారులు తమ కార్డులను ఈకేవైసీ చేయించుకోవడం పెద్ద సమస్యగా మారింది. కార్డుల్లోని కుటుంబ సభ్యులంతా ఈ ప్రక్రియను చేయించుకోవాలని కేంద్రం నిబంధన విధించింది. ఇది పూర్తయితే కార్డులోని సభ్యులంతా ఉన్నారా.. లేదా..? అని తెలిసిపోతుంది. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు పలువురు కార్డులో సభ్యులుగా చేరిఉంటారు. అలాంటి వారంతా ఇప్పుడు ఈకేవైసీ చేయించడం వల్ల వారి వివరాలు అప్‌డేట్ అవుతాయి. ఈనేథ్యంలో కార్డుదారులంతా ఈకేవైసీ చేయించుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

మిగిలింది నాలుగు రోజులే !

- గుబులు రేపుతున్న ఈకేవైసీ
- రేషన్‌కార్డుదారుల్లో ఆందోళన
- జిల్లాలో 2,01,951 మందికి పెండింగ్
- చేయించుకోకుంటే సరుకులు బంద్

జిల్లాలో 7.21లక్షల రేషన్ కార్డులున్నాయి. వీటిలో 20,04,581మంది సభ్యులున్నారు. వీరికి 1,513 చౌకదుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం 20.4లక్షల మంది ఈకేవైసీ చేయించుకోవాలి. ఇప్పటివరకు 18,02,630మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 2,01,951మంది చేయించుకోలేదని జిల్లా పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. ఈనెలాఖరులోగా చేయించుకోకపోతే ఏప్రిల్‌లో రేషన్‌సరుకులు ఇవ్వబోమని డీఎస్‌వో డీ. అంకయ్య చెబుతున్నారు.

● కార్డుదారుల ఆందోళన

అధికారుల తీరుతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. కార్డుల్లో ఉన్న విద్యార్థులు చాలామంది ఇతర ప్రాంతాల్లో చదువుల కోసం వెళ్లి ఉన్నారు. అంతేకాక ప్రస్తుతం పరీక్షల సీజన్ కొనసాగుతోంది. ఆ విద్యార్థులంతా చదువులపైనే దృష్టి పెట్టారు. తల్లిదండ్రులు సైతం పరీక్షల సమయంలో పిల్లలను ఇబ్బందులు పెట్టకూడదని జాగ్రత్త పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని లేకపోతే, వచ్చే నెలలో సరుకులు ఇవ్వమని చెప్పడంపై కార్డుదారులు మండిపడుతున్నారు.

● అధికారుల వితండ వాదన

నిబంధనలతో కార్డుదారులు ఆందోళన చెందుతుంటే, అధికారులు మాత్రం వితండ వాదన చేస్తున్నారు. ఎక్కడున్నా చౌకదుకాణం డీలర్లు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ, వార్డు సచివాలయం, ఈపోస్ మిషన్ల ద్వారా ఈకేవైసీ చేయించకోవచ్చునని చెబుతున్నారు. బయట వెళ్లిన విద్యార్థులకు ఆయా ప్రాంతాల్లో సచివాలయాలు, గ్రామ రెవెన్యూ అధికారి, రేషన్‌డీలర్లు ఎక్కడుంటారో తెలియదు.



రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ చేయించుకుంటున్న కార్డుదారులు

ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థులను బయటకు రాని వ్వరు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారికి అక్కడ సచివాలయాలు ఉంటాయో, లేదో తెలియదు. అయితే ఇక్కడ అధికారులు మాత్రం ఎక్కడోచోట ఈకేవైసీ చేయించుకోవాలని, లేక పోతే సరుకులు కట్ అవుతాయని చెబుతు న్నారు. ఈ వ్యవహారం కార్డుదారులకు మరింత ఇబ్బందిగా మారింది.

ఈకేవైసీ చేయించుకుంటేనే సరుకులు

రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈ విషయాన్ని కొద్ది రోజులుగా చెబుతూ వస్తున్నాం. జిల్లాలో ఇంకా రెండు లక్షల మందికిపైగా ఈకేవైసీ చేయించుకోవాలి. నెలాఖరువరకు అవకాశం ఉంది. అప్పటికి ఎంతమంది చేయించుకున్నారో వారికి మాత్రమే ఏప్రిల్ నెల సరుకులు అందుతాయి.

- డీ అంకయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి

డీఆర్‌డీఏలో అక్రమాలపై చర్యలు

- రూ.1.41 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు వెల్లడి
- ఏడుగురు ఉద్యోగులపై వేటుకు రంగం సిద్ధం ?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పేదల సొమ్మును దిగమింగిన అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. యానాదులకు దక్కాల్సిన నిధులను తినేసిన వ్యక్తుల నుంచి రికవరీ చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీఏలో ఇంటి దొంగల పనిపట్టేందుకు రంగం సిద్ధమైంది. రాపూరు మండలంలో జరిగిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 24న 'డీఆర్‌డీఏలో ఇంటిదొంగలు' అనే శీర్షికన కథనం, అలానే 27న 'అమాయకుల నోళ్లు కొట్టారు!' అనే శీర్షికన కథనం ప్రచురితమయ్యాయి. స్పందించిన డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి విచారణను వేగవంతం చేశారు. తొమ్మిది మందితో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికను కలెక్టర్ ముందు పెట్టారు. కలెక్టర్ ఆదేశాలతో నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన ఉద్యోగులను గుర్తించి చర్యలకు ఉపక్రమించారు. రాపూరు మండలంలో పొదుపు సంఘాలకు సంబంధించిన రూ.1.41 కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు పీడీ నాగరాజకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో ఇప్పటికే రూ.57 లక్షలు రికవరీ చేశామని, మరో రూ.84 లక్షలు రికవరీ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. ఈ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ఏడుగురు ఉద్యోగులపై చార్జస్ ఫ్రేమ్ చేసినట్లు వెల్లడించారు. వీరందరికీ నోటీసులు జారీ చేశామని, వారి వివరణ తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పీడీ పేర్కొన్నారు.

కాకాణి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై
విచారణ ఒకటికి వాయిదా

- వివరాలు సమర్పించాలని పోలీసులకు ఆదేశం



అమరావతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్ ఆరోపణలతో పొదలకూరు పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరి 16న తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ కేసుకి సంబంధించి పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పొదల కూరు మండలం, వరదాపురం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న పొదల కూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీనేత కాకాణి గోవర్ధన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచార ణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి స్పందిస్తూ... మధ్యంతర ముందస్తు బెయి ల్ కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేశామన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ... పోలీసులు వివరాలు సమర్పించిన అనం తరం అను బంధ పిటిషన్ పై విచారణ జరుపుతామని స్పష్టం చేశారు.మరోవైపు ఇదే కేసును కొట్టివేయాలని కోరుతూ కాకాణి వేసిన మరో పిటిషన్‌ని కూడా న్యాయమూర్తి ఏప్రిల్ 1కి వాయిదా వేశారు.



విడవలూరు ఎంపీపీగా ప్రమాణం చేస్తున్న ఏకుల శేషమ్మ



పొదలకూరు : ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న తాటిపర్తి ఉప సర్పంచి పెంచల లక్ష్మమ్మ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.26 (శుక్రవారం సాయంత్రం)

సహరి : 4.51 (శనివారం ఉదయం)

- విడవలూరు ఎంపీపీగా ఏకుల శేషమ్మ
- తాటిపర్తి ఉప సర్పంచిగా పెంచల లక్ష్మమ్మ
- ఇనమడుగు ఉప సర్పంచుగా చేజర్ల మోహన్
- దగదర్తి మండల వైస్ ఎన్నిక నేటికి వాయిదా

'స్థానిక'ంలో టీడీపీ మద్దతుదారుల విజయం

జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ అయిన విడవలూరు ఎంపీపీ, పొదలకూరు మండలం తాటిపర్తి, కోవూరు మండలం ఇనమడుగు ఉపసర్పంచు పదవులకు గురువారం ఎన్నికలు నిర్వహించగా, టీడీపీ మద్దతుదారులు విజయం సాధించారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కాగా దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక కూడా జరగాల్సి ఉండగా,ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు ప్రకటించారు. ఆ వివరాలు...

విడవలూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ స్థానాన్ని టీడీపీ మద్దతుదారు కైవసం చేసుకున్నారు. మండలంలోని ఊటుకూరుకి చెందిన ఎంపీటీసీ ఏకుల శేషమ్మ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీగా ఉన్న భవానమ్మ గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ముదివర్తికి చెందిన ఎంపీటీసీ కాయల సౌందర్య తాత్కాలిక ఎంపీపీగా కొనసాగుతూ వస్తున్నారు. ప్రభుత్వం ఎంపీపీ ఉప ఎన్నికకు ఈనెల 18న నోటిఫికేష్ విడుదల చేసింది. దీంతో స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఎన్నికను నిర్వహించారు. మండలంలో 13 మందికిగాను 9 మంది ఎంపీటీసీలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండల వైస్ ఆవుల శ్రీనివాసులు ఏకుల శేషమ్మని ప్రతిపాదించగా, వావిళ్ల ఎంపీటీసీ తాతా రమ బలపరిచారు. మిగిలిన ఏడుగురు ఎంపీటీసీలు చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో శేషమ్మ ఎంపీపీగా ఎంపికయినట్లు ఎన్నికల అధికారి మోహన్‌రావు ప్రకటించారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎంపీపీని పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, తహసీల్దారు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి కోడూరు కమలాకర్‌రెడ్డి, అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, రామిరెడ్డి విజయబానురెడ్డి, పొన్నలూరు పురందర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




కోవూరు : ఇనమడుగు ఉప సర్పంచిగా నియామకపత్రాన్ని అందుకుంటున్న చేజర్ల మోహన్

● ఏకగ్రీవంగా ఉపసర్పంచి ఎన్నిక

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిపర్తి ఉపసర్పంచిగా కర్పూరం పెంచలలక్ష్మమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపసర్పంచిగా ఉన్న వ్యక్తి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. గురువారం జరిగిన ఎన్నికల్లో మూడో వార్డు మెంబరు పెంచలలక్ష్మమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వీరయ్య ప్రకటించారు. అనంతరం ఆమెకు ధ్రువీకరణ పత్రం అందచేసి, పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు. తాటిపర్తి సమస్యాత్మక గ్రామం కావడంతో నెల్లూరు డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నేతృత్వంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ ఎన్నిక పట్ల టీడీపీ నేతలు హర్షం ప్రకటించారు.

● ఇనమడుగు ఉపసర్పంచుగా చేజర్ల మోహన్

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇనమడుగు ఉపసర్పంచుగా టీడీపీ బలపరచిన చేజర్ల మోహన్ గురువారం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు ప్రకటించారు. తొమ్మిది వార్డు సభ్యుడు చేజర్ల మోహన్ వైసీపీకి చెందిన వార్డు సభ్యుడు నన్నం శ్రీనివాసులుపై పోటీ చేసి గెలుపొందారు. వైసీపీకి చెందిన ఎస్. మణికంఠ రాజీనామాతో ఉపసర్పమ పదవికి ఖాళీ ఏర్పడింది. టీడీపీ, వైసీపీలు బలపరచిన అభ్యర్థుల మధ్య పోటీ ఉద్రిక్తతల నడుమ జరిగింది. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉపసర్పంచుగా గెలు పొందిన మోహన్‌ను టీడీపీ నాయకు లు జెట్టి రాజగోపాలరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, సునీల్‌రెడ్డి అభినందించారు.



బిట్రగుంట : ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల కోసం ఎదురుచూస్తున్న రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు తదితరులు

● నేడు దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక

దగదర్తి, (బిట్రగుంట) మార్చి 27(ఆంధ్రజ్యోతి): దగదర్తి ఎంపీ డీవో కార్యాలయ సమావేశ భవనంలో గురువారం వైస్ ఎంపీపీ ఉపఎన్నికకు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు, తహసీల్దారు కృష్ణ ఎన్నిక నిర్వహించేందుకు ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరూ రాకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

రైతుల మొర ఆలకించరా !?

- భూసేకరణ నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్
- ఏపీ మారిటైమ్ బోర్డు అధికారులను కలిసిన చేవూరు రైతులు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం చేవూరులో చేస్తున్న భూసేకరణ తీరుపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామస్థుల ఉపాధి, ప్రత్యామ్నాయ జీవనాధారం గురించి పట్టించుకోకుండా భూమిని తీసుకునే దిశగా అధికారులు మొండిగా భూసేకరణ నోటిఫికేషన్లు విడుదల చేస్తుండటంపై రైతుల్లో అభ్యంతరం వ్యక్తం అవుతోంది. ఈ నెల 22న గ్రామంలో కందుకూరు సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజ, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, భూసేకరణ అధికారులు ప్రజాభి ప్రాయ సేకరణ కోసం నిర్వహించిన సమావేశంలో పలు అభ్యంతరా లను వ్యక్తం చేసిన గ్రామస్థులు అదే విషయాన్ని ఏపీ మారిటైమ్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రధానంగా గ్రామం చుట్టూ భూమిని మొత్తం తీసేసుకుంటున్నందున తమ జీవనోపాధి ఎలా అన్నది అధికారులు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో రెండో వంతు జనాభా వ్యవసాయ కూలీలే ఉన్నందున వారికి ప్రత్యామ్నాయ ఉపాధిపై స్పష్టత ఇవ్వాలని, ఫిబ్రవరి 28న జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కొన్ని దశాబ్దాలుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్న కొన్ని భూములు రెవెన్యూ రికార్డులలో కుంటపోరంబోకుగా ఉన్నందున క్షేత్ర పరిశీలన ద్వారా ఆ భూముల క్లాసిఫికేషన్ మార్పు చేసి సాగుదారులకు పరి హారం అందేలా చూడాలన్నది మరో డిమాండ్. ఈ డిమాండ్లలో పేదలు సాగు చేసుకుంటున్న కుంటపోరంబోకు భూములకు 50 శాతం పరిహా రం అందేలా చర్యలు తీసుకుంటామని, గత నెల 28న జారీ చేసిన నోటి ఫికేషన్ రద్దయ్యేలా చూస్తామని సబ్ కలెక్టరు, భూసేకరణ అధికారులు హామీ ఇచ్చినా మిగిలిన డిమాండ్లపై వారు స్పష్టమైన హామీ ఇవ్వలేక పోయారు.

● మారిటైమ్ బోర్డు చైర్మన్, ఉన్నతాధికారులతో భేటీ

చేవూరు రైతులు గ్రామానికి చెందిన నూతలపాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో గత మంగళవారం పోర్టు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రాజశేఖర్‌తోపాటు వెళ్లి ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, భూసేకరణ అధికారులతో భేటీ అయ్యారు. గ్రామం చుట్టూ కొంత భూమి వదిలాలని, ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, చేవూరును పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలని, గ్రామ పరిధిలో జాతీయ రహదారి వెంట అటవీ శాఖ 50 ఎకరాల్లో చిల్డ్రన్స్ పార్కు, హోటల్ అభివృద్ధి చేస్తున్నందున దానిచెంతనే ఉన్న చెరువుతో కలుపుకుని బోటు షికారు, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.కలెక్టరుతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

నగరంలో మినీ బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులను ఎలాగైనా దక్కించుకోవాలని కుట్ర పన్నిన ఓ కాంట్రాక్టర్, రాజకీయ నాయకుడైన అతడి తండ్రి ప్రయత్నాలు బెడిసికొట్టాయి. టెండర్లు వేయకుండా ఇతర కాంట్రాక్టర్లను అడ్డుకోగా, ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఇంకొంతమంది ఒత్తిడి తెచ్చారు. అయితే మినీ బైపాస్ వర్కుకు గురువారం టెండర్లు ఓపెన్ చేయగా సదరు కాంట్రాక్టర్ డిస్‌క్వాలిఫై అవ్వడం గమనార్హం. ఈ కాంట్రాక్టర్‌కు ఎక్స్‌పీరియన్స్ లేకపోవడంతో నేషనల్ హైవే (ఎన్‌హెచ్) అధికారులు అతడి టెండర్‌ను డిస్‌క్వాలిఫై చేశారు. అంటే అర్హత లేకపోయినా అడ్డదారిలోనైనా వర్కు దక్కించుకోవాలన్న ప్రయత్నాలు జరిగినట్లు దీనిని బట్టి స్పష్టమవుతోంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)


డామిట్.. కథ అడ్డం తిరిగింది!

- మినీ బైపాస్ రోడ్డు వర్కు కోసం ఓ కాంట్రాక్టర్ ప్రయత్నాలు
- మిగిలినవారు పోటీ రాకుండా బెదిరింపులు
- కొంతమందిని అడ్డుకోవడంలో సఫలం
- అయితే చివరకు ఆ కాంట్రాక్టర్‌కే ఎదురుదెబ్బ
- ఎక్స్‌పీరియన్స్ లేకపోవడంతో డిస్‌క్వాలిఫై చేసిన ఎన్‌హెచ్

నెల్లూరులో దెబ్బతిన్న మినీ బైపాస్ రోడ్డును బాగు చేయాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులు రూ.13.74 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. ఇది ఎన్‌హెచ్ వర్కు కావడం తో త్వరగా బిల్లులు వస్తాయన్న ఉద్దేశంతో చాలా మంది కాం ట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపారు. అయితే నెల్లూ రుకు చెందిన ఓ రాజకీయ నేత ఎలాగైనా ఈ వర్కును దక్కిం చుకోవాలని ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వెళ్లిపోయే సదరు నేత.. తన కుమారుడికి ఆ వర్కును ఇప్పించేందుకు పావులు కదిపారు. కాంట్రాక్టర్లు టెండర్లు వేయకుండా తనకున్న పలుకుబడితో పరోక్ష బెదిరింపులు చేయిం చినట్లు కాంట్రాక్టర్ల వర్గాలు చెబుతున్నాయి. అయితే ఐదుగురు బడా కాంట్రాక్టర్లు మాత్రం టెండర్లు వేశారు. పాపం.. సదరు రాజకీయ నేత వర్కు కోసం దొడ్డిదారిలో ఇంత కష్టపడగా, చివరకు అతడి కుమారుడు ఆ వర్కుకు క్వాలిఫైనే కాకపోవడం గమనార్హం. ఈ వర్కుకు నేషనల్ హైవే అధికారులు పెట్టిన ఎక్స్‌పీరియన్స్ నిబంధనను ఈ కాంట్రాక్టర్ అందుకోలేక పోవడంతో డిస్‌క్వాలిఫై చేసినట్లు సమాచారం.

నాడు ఆర్‌అండ్‌బీలోనూ ఇంతే

ఈ రాజకీయ నేతకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అక్కడి పెద్దలతో సంబంధాలు పెంచుకుంటుంటారు. ఆ పరిచయాలతో దొడ్డిదారిలో టెండర్లు దక్కించుకోవడం ఆయన ప్రత్యేకతగా ఇంజనీరింగ్ వర్గాలు చెబుతుంటాయి. వైసీపీ ప్రభుత్వంలో కూడా ఈ నేత కుమా రుడికి ఓ వర్కును కట్టబెట్టేందుకు అనేక కుట్రలు జరిగాయి. నెల్లూరు-కృష్ణపట్నం పోర్టు నిర్వహణకు 2022లో టెండర్లు జరగ్గా అప్పుడు కూడా ఈ కాంట్రాక్టర్‌కు ఎక్స్‌పీరియన్స్ లేదు. అయినా ఫేక్ సర్టిఫికెట్లతో టెండర్ దాఖలు చేశారు. ఈ విషయం బయటకు రాకపోయి ఉంటే ఆ వర్కు సదరు కాంట్రాక్టర్‌కే దక్కేది. అయితే వ్యవహారం బయటపడటంతో అప్పుడు కూడా డిస్ క్వాలిఫై చేశారు. ఫేక్ ఎక్స్‌పీ రియన్స్ పెడితే సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి. అయినా తనకున్న పలుకుబడితో ఆ రాజకీయ నేత.. తన కుమా రుడిని బ్లాక్ లిస్టులో పెట్టకుండా తెరవెనుక చక్రం తిప్పా రు. అప్పుడు ఆర్‌అండ్‌బీలో చేసిన జిమ్మిక్కు మాదిరిగానే ఇప్పుడు ఎన్‌హెచ్‌లో కూడా ఎక్స్‌పీరియన్స్ లేకపోయినా వర్కు దక్కించుకునేందుకు ప్రయ త్నాలు చేయడం తీవ్ర చర్చనీయాం శంగా మారింది. కాగా మినీబైపాస్ రోడ్డుకు ప్రైస్ బిడ్‌ను ఓపెన్ చేయగా ఓ కాంట్రాక్టర్ 23.15 శాతం లెస్‌కు టెండర్ దక్కించుకోవడం గమనార్హం. అంటే రూ.13.74 కోట్ల వర్కును రూ.10.56 కోట్లకు చేస్తానని సదరు కాంట్రాక్టర్ ముందుకొచ్చారు. ఇంత ఎక్కువ లెస్‌కు దక్కించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. మిగిలిన కాంట్రాక్టర్లు 3.49 శాతం, 1.86 శాతం, 0.01 శాతం లెస్‌కు కోట్ చేయగా మరో కాంట్రాక్టర్ 0.03 శాతం ఎక్సెస్‌కు కోట్ చేయడం గమనార్హం.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8488
వెండి కిలో ధర	రూ. 102,000
వెండి ఒక గ్రాము	రూ.105.50

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): కరేడు గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రవేశం కోసం ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే సింధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 మంది విద్యార్థుల చొప్పున ప్రవేశానికి అవకాశం ఉందన్నారు. అదేవిధంగా 7,8 తరగతులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉన్న ఖాళీలను భర్తీచేయుటకు అనుమతులు లభించినందున ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9603709478 ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు పొందవచ్చని తెలిపారు.

పగడాల ప్రవీణ్ హత్య దారుణం

అల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో దైవ ప్రచారకుడు పగడాల ప్రవీణ్ కుమార్‌ను హత్యచేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నా.. ప్రమాదంగా భావించడం దారుణమని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయంపై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన పేర్కొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన

దగదర్తి, (బిట్రగుంట) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిపోడు సెంటర్ వద్ద టీడీపీ నేతలు మాలేపాటి సోదరుల ఆధ్వ ర్యంలో నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, స్వర్గీయ ఎన్టీరామారావు విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. గురువారం మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు, సాగునీటి సంఘం మండలాధ్యక్షులు మాలేపాటి సుధాకర్‌నాయుడు, మండల యువనేత భానుచందర్‌నాయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భాను మాట్లాడారు. భావితరాల మహనీయులను గూర్చి తెలియజేసేందుకు విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు వడ్డే వెంకటేశ్వర్లు, కంచర్లకృష్ణ, ముప్పాల సురేష్, పేపాలసూరి బాబు, పురిమెట్ల మనోహర్, పెంచలయ్య, అంకబాబు, రమణమ్మ, రాధయ్య తదితరులు ఉన్నారు.

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

బిట్రగుంట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని రోడ్లు, కాలువలు అధ్వానంగా మారాయని, అందుకు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణం అని బోగోలు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు మద్దిబోయిన వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ప్రధాన కాలువ చెత్తాచెదారంతో పూడుకు పోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని మండిపడ్డారు. అలాగే కోదండరామాలయం వద్ద కాలువను శుభ్రం చేసి నెలలు గడు స్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు వాపోయారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జహీర్‌ని వివరాలు కోరగా సిబ్బందితో వెంటనే శుభ్రం చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్స్‌ఫర్డ్‌లో ముందస్తు రంజాన్ వేడుకలు

కందుకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్‌లో గురువారం ముందస్తు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మతపెద్ద మౌలానా రియాజ్ పాల్గొనగా ముస్లిం విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో హాజరై వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా వారిచే ప్రత్యేకంగా దువా చేయించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లు, ఖర్జూరం, ఖీర్ పంచి పెట్టారు. విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కర్, నరేంద్రబాబు పాల్గొన్నారు.

మద్యం సిండికేట్..!

- షాపుల్లో మద్యం బార్లలో అధిక ధరకు విక్రయం
- ఆదాయం సగం.. సగం
- తెల్లవారుజామునే తెరుచుకుంటున్న బార్లు
- కందుకూరులో వ్యాపారుల తీరు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

కందుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారు. పైకి చూసేందుకు మద్యం షాపులు తూ.చ తప్పకుండా నిబంధనలు పాటిస్తున్నట్లు కనిపించేలా వ్యవహరిస్తూ అక్కడి మద్యం బార్ అండ్ రెస్టారెంట్లలో అధిక దరకు విక్రయిస్తూ మందుబాబులను దోచు కొంటున్నారు. వచ్చే ఆదాయం సగం పగం పంచుకు న్నటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పక్కా ప్రణాళికతో రూపకల్పన చేసి ఈ సిండికేట్ వ్యవహారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఇదంతా తెలిసినా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తూ వ్యాపారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కందుకూరులో ప్రస్తుతం జరుగుతున్న మద్యం లాలూచీ వ్యాపారం గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఇలాగే కొనసాగింది. అప్పటి ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలలో ప్రజలు కోరుకునే ఏ బ్రాండ్లు దొరకకుండా చేసి వాటిని బార్ అండ్ రెస్టారెంట్లకు తరలించి భారీగా అదనపు వసూళ్లతో విక్ర యాలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అదే తరహా లో బార్ అండ్ రెస్టారెంట్‌లలో క్వార్టర్ సీసాపై రూ.60 అదనంగా వసూలు చేస్తూ ఆ మొ త్తాన్ని దుకాణదారులు, రెస్టారెంట్ల నిర్వాహకులు పంచు కుంటున్నారన్న ఆరోప ణలు ఉన్నాయి. దీంతో తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. దోపిడీకి గురవుతున్న మద్యం ప్రియులు మాత్రం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఈ వ్యవహారం నడుస్తుండగా గతంలో పోలిస్తే రోజుకు లక్ష రూపాయల వరకు అదనపు రాబడి వస్తుండటంతో ఎక్సైజ్ అధికారుల సహాయ సహకారాలతో సిండికేట్‌ను నడిపిస్తున్నారన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.


కందుకూరు పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్

● తెల్లవారకముందే తెరుచుకుంటున్న బార్లు

నూతన మద్యం పాలసీ అమల్లోకి తెచ్చాక కందుకూరు పట్టణంలో 7 మద్యం దుకాణాలు ఏర్పాటు కాగా ఎప్పటి నుంచో 3 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇటీవలి కాలం వరకు మద్యం దుకాణాలు సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయించాలని చేసిన ప్రయ త్నాలు ఫలించక పోవడంతో పక్కా ప్రణాళి కతో బార్ల యజమానులతో కలసి సిండికేట్ ఏర్పాటు చేశారు. నిన్న మొన్నటి వరకు వేళలు పాటించకుండా, షాపుల వద్ద సిట్టింగ్ ఏర్పాటు చేస్తూ లూజు విక్రయాలు చేసిన మద్యం వ్యాపారులు ప్రస్తుతం వాటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేశారు. వేళకు దుకాణాలు తెరిచి వేళకు మూసి వేయటమే గాక మిగిలిన నిబంధ నలన్నీ తూ.చ తప్పకుండా పాటిస్తూ అధిక ఆదాయం వచ్చే బ్రాండ్లను ఉదయం, రాత్రి వేళల్లో అధికంగా అమ్ముడు పోయే పేద వారి బ్రాండ్ చీప్ లిక్కర్‌ను బార్ అండ్ రెస్టారెంట్లలో అందుబాటులోకి తెచ్చేశారు. గతంలో ఉదయాన్నే తీసే మద్యం దుకా ణాలు వేళఅయ్యే వరకు తెరకపోతుండగా బార్ అండ్ రెస్టారెంట్లు మాత్రం వేకువజామునే బార్లా తెరుచుకుంటున్నాయి. టీ దుకాణాల కన్నా ముందే బార్లు తీస్తుండ టమే గాక అర్ధరాత్రి వరకు విక్రయాలు సాగి స్తుండటంతో మందుబాబు లు ఆ సమయాల్లో విధిలేక బార్‌కు వెళ్లి అదనపు దరకు కొనుగోలు చేస్తున్నారు. సిండికేట్‌గా మారటంతో ఇక తమను అడిగేవారు ఉండరన్న ధీమాతో అన్నిరకాల బ్రాండ్లపై క్వార్టర్‌కు రూ. 60 నుంచి 80 వరకు వసూలు చేస్తుండటమే గాక బీర్ బాటిల్‌పై రూ.100 వరకు అదనంగా బాదుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి ఎక్సైజ్ అధికారులు కూడా సంపూర్ణ సహకారం అందిస్తుం డటంతో సిండికేట్ వ్యవహారం మూడు క్వార్టర్లు ఆరు బీర్లు అన్న చందంగా మారింది.

బార్ అండ్ రెస్టారెంట్లూ నిబంధనలు పాటించేలా చూస్తాం

కందుకూరు పట్టణంలో మద్యం దుకాణదారులు సమయపాలన, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకున్నాం. ఇకముందు బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు కూడా నిబంధనలు పాటించేలా చూస్తాం. మద్యం షాపులకు సంబంధించిన మద్యం బయట పట్టుబడితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవు.

\- ఎక్సైజ్ సీఐ వెంకటరావు

సమగ్ర వివరాలు నమోదు చేయాలి

కొండాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని విద్యార్థులందరి సమగ్ర వివ రాలను రికార్డులలో నమోదు చేయాలని ఎంఈవో-2 ఆనంద రావు తెలిపారు. గురువారం మండ లంలోని మర్రిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు ఆదేశించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కార్యకర్తకు పలు సలహాలు ఇచ్చారు.

ఉపాధిహామీ పనులపై బహిరంగ విచారణ

దగదర్తి (బిట్రగుంట), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24లో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై గురువారం మండల కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ గంగాభవానీ ఆధ్వర్యంలో అధికారులు బహిరంగ విచారణ చేపట్టారు. మండలంలోని 20పంచాయతీలకు సంబంధించిన పనుల్లో రూ.6.83లక్షల అవినీతి జరిగినట్లు గుర్తించారు. వీటిపై అధికారులు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ మృదుల, డీఈవో విజయలక్ష్మీ, అంబుడ్స్‌మేన్ వెంకటరెడ్డి, ఎస్‌టీఎం కోనయ్య, ఆవులయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ సర్పంచులు ఉన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

కందుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 29వ తేదీన వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు ప్రతిఒక్కరూ స్పందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని గ్రామాలు, కందుకూరు పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు నిర్వహించాలని కోరారు.

డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రాజకుమార్ చౌదరి


పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాలల కరస్పాండెంట్లు

కావలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ప్రయివేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జీ.రాజకుమార్ చౌదరిని ఎన్నుకున్నారు. మంగళగిరిలోని వైష్ణవి కల్యాణ మండపంలో గురువారం జరిగిన రాష్ట్ర డిగ్రీ కళాశాలల కరస్పాండెట్ల సమావేశంలో 250 మంది పాల్గొనగా రాజకుమార్‌చౌదరిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజకుమార్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాశాలల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనను ప్రధానకార్యదర్శిగా ఎన్నుకున్న కరస్పాండెంట్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

క్రీడాకారుల అభివృద్ధికి సుబ్బారావు కృషి ఎనలేనిది

● సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

కందుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల అభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయుడిగా తొట్టెంపూడి సుబ్బారావు చేసిన కృషి ఎనలేనిదని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీగా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న సుబ్బారావుకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, క్రీడాకారులు గురువారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా జిల్లా స్థాయిలో వివిధ క్రీడాపోటీలకు కందుకూరు టీఆర్ఆర్ కళాశాల వేదికగా మారడంతో పాటు జిల్లా స్థాయి జట్లకు శిక్షణ శిబిరాలు, జిల్లా జట్ల ఎంపికల కార్యక్రమాలు ఇక్కడే జరిగాయంటే దాని వెనుక పీడీ సుబ్బారావు కృషి ఎనలేనిదని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి పీడీ సుబ్బారావు దంపతులను ఘనం గా సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్‌వలీ, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్, వివిధ కళాశాలల అధ్యాపకులు, ప్రైవేటు కళాశాలల కరస్పాండెంట్లు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వివిధ కళాశాలల్లో పని చేస్తు న్న వ్యాయామ ఉపాధ్యాయులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయు లు పాల్గొని సుబ్బారావును సత్కరించారు.


తొట్టెంపూడి సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తదితరులు

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాల పర్యటన

వలేటివారిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో పర్యటించను న్నాయి. ఈ తనిఖీ బృందాలు పంచాయతీల్లో ఏఏ పనులు చేపట్టారు, వాటికి బిల్లులు, చెల్లిం పులు వంటి వివరాలు, రికార్డులను పరిశీలించి అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేస్తారు. కాగా, నిష్పక్షపాతంగా తనిఖీలు చేపడితే భారీస్థాయిలో అక్రమాలు బయటపడ తాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

సిబ్బందిలో టెన్షన్ టెన్షన్

ఉపాధి హామీ పనులపై తనిఖీలు చేపట్టేందుకు సామాజిక తనిఖీ బృందాలు రావడంతో సిబ్బందిలో టెన్షన్ నెలకొంది. తాము చేసిన అవినీతిని బయటపెట్టకుండా ఉండేందుకు సామాజిక తనిఖీ బృందాలకు సపర్యలు చేస్తున్నారు. ఎక్కడ తమ అవినీతి బయటపడుతుందోనని రికార్డు లను సరిచేసుకునే పనిలో నిమగ్నమ య్యారు. సామాజిక తనిఖీ బృందంతో చర్చలు జరిపేందుకు కూడా వెనకాడట్లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంగమ్మకు విశేష పూజలు


దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో గురువారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు అమ్మవారికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో విశేష పూజలు, అలంకారాలు చేపట్టారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, ఆలయ ఛైర్మన్ పాముల రమణయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి మాలకొండయ్య రూ.5 లక్షలు, రమణయ్య రూ.2 లక్షలు విరాళం అందజేయడంతో వారిని ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది.

భక్తిశ్రద్ధలతో షబే-బరాత్


విద్యుత్ దీపాలంకరణలో ఉదయగిరి పెద్ద మసీదు

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలో గురువారం షబే-బరాత్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి మసీదుల్లో జాగారం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

●అనంతసాగరం: మండలంలోని సోమశిల, అనంతసాగరం, కచ్చేరిదేవ రాయపల్లి, ఆమనిచిరివేళ్ల, ఉప్పలపాడు, ముస్తాపురం, గౌరవరం, పాతదేవరాయపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి షబే బరాత్ వేడుకలను ముస్లీంలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగ ప్రాముఖ్యతను మౌలానాలు వివరించారు.

167-బీ జాతీయ రహదారి నిర్మాణం పూర్తిచేయండి

● లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి గళం

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెట్ట ప్రాంత ప్రజలకు మణిహారమైన 167-బీ జాతీయ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఎప్పటికి పూర్తి చేస్తారో వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం లోక్‌సభలో తన గళాన్ని వినిపించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సీతారామపురం వద్ద ఏర్పాటు చేయనున్న బైపాస్‌ను ఎప్పటికి పూర్తి చేస్తారని ఆరా తీశారు. ఈ రహదారికి సంబంధించి ఇప్పటివరకు 70 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని, ఎప్పటికి పూర్తి చేస్తారో వాస్తవ వివరాలు తెలియజేయాలని కోరారు. దీంతో స్పందించిన కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖా మంత్రి నితిన్‌జైరామ్‌గడ్కారీ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏపీలోని ఎన్‌హెచ్-167బీ ఆధునికీకరణ, పునరావాసంలో భాగంగా సీతారామపురం బైపాస్ రోడ్డు మంజూరు చేయబడిందన్నారు. ఆగస్టు 2024 నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఫిబ్రవరి 2023లో ప్రాజెక్టు ప్రారంభమైందన్నారు. బైపాస్ రహదారి కాంక్రీట్, గ్రామాల వద్ద నేమ్‌బోర్డుల ఏర్పాటు పనులు పూర్తి చేశామన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు 93 శాతం పనులు పూర్తయ్యాయని, మే 31 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.


లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త కొట్టే వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తోటలచెరువుపల్లి, వరికుంటపాడు గ్రామాల్లోని ముస్లీంలకు మండల కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలను ఉన్నత స్థాయిలో నిలపాలన్న ఆశయంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్టీని స్థాపించారన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని స్వంత నగదుతో బియ్యం, నూనె, సేమియా, చక్కెర వంటి సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అలాగే ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో సహా కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్, జిల్లా కార్యదర్శి రవీంద్ర, నాయకులు కాకుమణి వెంకట్, గుమ్మలంపాటి వెంగళరావు, మారెళ్ల రజాక్, మానం నిఖిల్, దగ్గుపాటి రవి, సురేష్ పాల్గొన్నారు.


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

వడదెబ్బకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలి

సంగం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల ప్రభావంతో వడదెబ్బకు గురికాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన స్థానిక వైద్యశాల ఆవరణలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు, అనారోగ్యంతో బాధపడేవారు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. తప్పని పరిస్థితుల్లో ఎండకు వెళ్లాల్సి వస్తే గొడుగు, తలకు టవల్ వినియోగించాలన్నారు. తగినన్ని నీళ్ల తాగాలన్నారు. ఉపాధి హామీ పనులు చేసేవారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి

నేడు సొసైటీ మహాజన సభ

దుత్తలూరు(ఉదయగిరి): మండలంలోని కమ్మవారిపాళెం సొసైటీ మహాజన సభను శుక్రవారం నిర్వహించనున్నట్లు పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సీఈవో లోకనాథ్‌రెడ్డి గురువారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సభకు సొసైటీ సభ్యులందరూ హాజరు కావాలని వారు కోరారు.

పాఠశాలకు మైకు సెట్ వితరణ


మైక్ సెట్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థి శ్రీనివాసులు

ఏఎస్ పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కావలిఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి నాగినేని శ్రీనివాసులు గురువారం మైకుసెట్, సౌండ్ బాక్సులు బహూకరించారు. ప్రస్తుతం వెంకటాచలం తహసీల్దారుగా పనిచేసున్న ఆయన తల్లి నాగినేని వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వాటిని అందించారు. మరో నాలుగు రోజులలో క్రీడా పరికరాలను కూడా అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

సోమశిలలో 53.848 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 53.848 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షి ణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

608 పొగాకు బేళ్ల కొనుగోలు

మర్రిపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 628 బేళ్లను తీసుకురాగా తొమ్మిది కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 608 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 255గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

ఉదయగిరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు గురువారం ఎంఈవో-2 శ్రీని వాసులు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలీమ్‌కో, సమగ్ర శిక్ష అభియాన్ వారు అందజేసిన హియరింగ్ మిషన్, వీల్‌ఛైర్లను భవిత కేంద్రంలోని శ్రావణ్ కుమార్, దీప్తిలకు అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహ, ఎం రమణ, ఐఆర్పీలు సుభాష్‌చంద్రబోస్, శివనందిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

సీతారామపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్‌కె మస్తాన్‌వలి సూచించారు. గురువారం మండల పరిధిలోని బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు, పండ్రంగి ప్రాథమిక పాఠశాలలో నలుగురు, సీతారామపురం కెజిబివిలో ఒక్కరు, ప్రాథమిక పాఠశాల స్పెషల్‌లో ఒక్కరిని మొత్తం 8 మంది విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బాలికల తల్లిదండ్రులు ఎక్కడికైనా వలస వెళ్ళినా దగ్గరలో ఉన్న కెజిబివిలో చేర్పిస్తే ఇంటర్మీడియట్ వరకు అన్ని వసతులతో కూడిన రెసిడెన్షియల్ విద్యను అందిస్తారని తెలిపారు.

తప్పయిపోయింది... క్షమించండి !

● మృతుడి తల్లిదండ్రులను వేడుకున్న కారు డ్రైవర్

వలేటివారిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు - బడేవారిపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ఈనెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో శింగమనేనిపల్లెకు చెందిన బాశం దినేష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ప్రమాదానికి కారకులైన కారుడ్రైవర్ ఆయన సతీమణి మృతుని స్వగ్రామైన శింగమనేనిపల్లె గ్రామంలోని మృతుడు దినేష్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు బాశం వెంకటేశ్వర్లు, సతీమణి మాధవిని కలిసి తప్పయిపోయింది.. తమను క్షమించాలని వేడుకున్నారు.

ఆ సచివాలయానికి మహిళా పోలీసే దిక్కు..!

●ఉద్యోగుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటల చెరువుపల్లి సచివాలయంలో పలు శాఖల ఉద్యోగులు నిరంతరం విధులకు ఎగనామం పెడుతున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం వివిధ పనులపై సచివాలయానికి వచ్చిన పలు గ్రామాల ప్రజలు గంటల తరబడి ఉద్యోగుల కోసం ఎదురుచూసి వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. ఫీల్డ్ పేరుతో రోజుల తరబడి కనీసం సచివాలయం వైపు కన్నెత్తి చూడకుండానే కాలం వెల్లబుచ్చుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో స్థానికంగా నివాసం ఉండే మహిళా పోలీసు మాత్రమే విధులకు హాజరవుతూ సచివాలయానికి దిక్కుగా మారుతుండడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోజుల తరబడి విధులకు ఎగనామం పెడుతున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసు



కండలేరును సందర్శిస్తున్న చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ తదితరులు

తిరుపతి చీఫ్ ఇంజనీర్ కండలేరు సందర్శన

రాపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు డ్యామ్ ను ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్ట్ తిరుపతి చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ గురువారం సందర్శించారు. కండలేరు డ్యాం హెడ్ రెగ్యులేటర్, మట్టి కట్ట, స్పిల్ వే తదితరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాధాకృష్ణారెడ్డి, ఈఈలు విజయ్‌కుమార్‌రెడ్డి, రామ చంద్రమూర్తి, అనిల్ కుమార్‌రెడ్డి, ధనుంజయులు, డీఈఈ విజయరామి రెడ్డి, ఏఈ తిరుమలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి, బిడ్డలపై మమకారం చూపాలి

- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి



ఉదయగిరి కళాకారులు చెక్కతో చేసిన ఆట బొమ్మలను పరిశీలిస్తున్న సూర్యకుమారి, కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్న తల్లీబిడ్డలపై మమకారం, వాత్సల్యం చూపించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ సూర్యకుమారి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖపై ఆమె సమీక్ష జరిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్ల నిర్వహణలో వంద శాతం ఫలితాలు సాధించాలని ఆదేశించారు. సుపోషిత్ పంచాయతీల్లో నిబంధనలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు కల్పిస్తే రూ.లక్ష పారితోషికం లభిస్తుందని చెప్పారు. పాఠశాల డ్రాప్ అవుట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాలసదనాలలో ఉండే బాలికలు కనీసం డిగ్రీ చదివే విధంగా, స్కిల్ డెవలప్‌మెంట్, వొకేషనల్ కోర్సులలో శిక్షణ ఇచ్చి వారి కాళ్ల మీద వారు నిలబడేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇంకా పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి కళాకారులతో కలెక్టర్ ఆనంద్ ప్రత్యేకంగా తయారు చేయించిన చెక్క ఆట వస్తువులను సూర్యకుమారికి చూపించారు. వీటిని రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రా లకు సరఫరా చేసేలా చూడాలని కలెక్టర్ ఆమెను కోరారు. ఆ బొమ్మలను పరిశీలించిన సూర్యకుమారి చాలా బాగున్నాయంటూ కళాకారులను అభినందించారు. అనంతరం బాలల న్యాయ చట్టం గోడ పత్రికలు ఆవిష్కరిం చారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ జయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ నిర్మలాదేవి, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, నగర డీఎస్పీ సింధుప్రియ తదితరులు పాల్గొన్నారు.

గోదాము నుంచే మిల్లర్లకు...!

- రేషన్ బియ్యం అక్రమ రవాణా
- కొనుగోలుకు పోటీ పడుతున్న వ్యాపారులు
- 'ఎంఎల్ఎస్' ఉద్యోగుల చేతివాటంపై ఫిర్యాదు
- విచారిస్తున్న కావలి ఆర్డీవో

కావలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేసిందన్న చందంగా రేషన్ బియ్యాన్ని కాపాడాల్సిన అధికారులే వాటిని అక్రమంగా మిల్లర్లకు రవాణా చేస్తున్నట్లు సమాచారం. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం బియ్యాన్ని రూ.40లకు కొనుగోలు చేసి ఉచితంగా అందజేస్తోంది. అయితే, ఈ బియ్యాన్ని కిలో రూ.25లకు చొప్పున గోదాము ఇన్‌చార్జులు, తాత్కాలిక గుమస్తాలు మిల్లర్లకు చేరవేస్తున్నట్లు వినికిడి. కావలి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము(పౌరసరఫరాల సంస్థ మండల స్థాయి గిడ్డంగి)ను ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మూడు పర్యాయాలు తనిఖీలు చేసినా రికార్డులకు, నిల్వలకు పొంతన కుదరలేదు. ఈ తనిఖీల తర్వాత కూడా అక్రమ రవాణా కొనసాగుతుండటంతో అక్రమార్కుల మధ్య ఏర్పడిన పోటీ కారణంగా బియ్యం అక్రమ రవాణా విషయం అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ ఆది, సోమవారాలోట్ల తనిఖీలు చేపట్టగా అక్కడ రూ.లక్షలు విలువ చేసే బియ్యం మాయమైనట్లుగా గుర్తించారు. దీంతో గతంలో పనిచేసిన తాత్కాలిక గుమాస్తా, ప్రస్తుత తాత్కాలిక గుమాస్తాను, బియ్యం అధికారికంగా రవాణా చేసే వాహనదారులను, హమాలీలను సైతం ఆర్డీవో విచారించినట్లు తెలుస్తోంది.



కావలిలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము

గోదాము నుంచే నేరుగా మిల్లర్లకు..

కావలి ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో కావలి పట్టణం, కావలి రూరల్, బోగోలు, జలదంకి మండలాలకు సంబంధించిన 146 రేషన్ దుకాణాలకు ప్రతి నెలా సుమారు 1,100 టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. వాటిలో మూడో వంతు బియ్యం పేదలకు చేరకుండా గోదాము వద్ద ఉన్న అధికారులు, సిబ్బంది కిలో రూ.25 చొప్పున మిల్లర్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ ఉద్యోగి ఏళ్ల తరబడి గోదాము వద్దనే పని చేస్తూ తనే సర్వం అనేలా వ్యవహరిస్తున్నారు. రేషన్ డీలర్లకు పంపే బియ్యంలో కొంత కోత విధించి మిగుల్చుకున్న బియ్యంతోపాటు డీలర్లు, ఎండీయూ వాహనదారులు లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసుకున్న బియ్యాన్ని మిల్లర్లకు దర్జాగా చేరవేస్తున్నారు.

బియ్యం కోసం పోటీ

రేషన్ బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులు, రైస్ మిల్లర్లు పెరిగినందున గోదాము ద్వారా వచ్చే బియ్యం తమకే ఇవ్వాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో అక్కడ పని చేస్తున్న ఓ ఉద్యోగి వ్యాపా రుల వద్ద లోపాయి కారీ ఒప్పందం చేసుకుని బియ్యం పంపుతుంటారనే ప్రచారం ఉంది. అయితే పాత వ్యాపారులకే సదరు ఉద్యోగి బియ్యం ఇస్తుండటంతో అధికార పార్టీకి చెందిన నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి రెండు నెలల క్రితం ఆయన స్థానంలో మరొకరిని నియమించారు. అయినా బియ్యం మాత్రం దొంగచాటుగా మిల్లర్లకు చేరిపోతోంది. ఇక్కడ జరుగుతున్న వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లటంతో కావలి ఆర్డీవో విచారణ చేపట్టారు.

విచారణ పూర్తయ్యాక చర్యలు

కావలి ఎంఎల్ఎస్ పాయింట్‌లో అక్రమాలు జరిగినట్లు నా దృష్టికి వచ్చింది. విచారణలో అక్కడ నిల్వలు తక్కువగా ఉన్నట్టు తేలింది. పూర్తిగా విచారణ చేపట్టాక ఎంత మేరకు సరుకు తగ్గుతుందో నిర్ధారించిన తదుపరి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- ఎం. సన్నీ వంశీక్రిష్ణ, ఆర్డీవో, కావలి

నేడు కావలికి రానున్న హైకోర్టు జడ్జిలు

కావలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):స్థానిక బార్ అసోసియేషన్ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం 6గంటలకు కావలి నూతన కోర్టు బిల్డింగ్ ఆవరణలో జరుగనుందని ఈ వేడుకలకు హైకోర్టు జడ్జిలు కే.శ్రీనివాసులురెడ్డి, కే.మన్మధరావులు హాజరవుతున్నట్లు కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. సురేంద్రరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలతో పాటు అతిథిగా నెల్లూరు ప్రిన్సిపల్ సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ సీ.యామినీ పాల్గొంటారని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వీ.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని బహుమతుల ప్రదానోత్సవం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదుల గుమస్తాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

1 నుంచి సదరం క్యాంపు పునఃప్రారంభం

నెల్లూరు (వైద్యం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల వైకల్యాన్ని గుర్తించే సదరం శిబిరాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుంచి పునః ప్రారంభించనున్న ట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ సిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం దివ్యాంగుల సర్టిఫికెట్లపై విచారణ జరుగుతోంది. ఈక్రమంలో గత జనవరి నుంచి 'సదరం' ఆగిపోవడంతో దివ్యాంగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సదరం క్యాంపు పునఃప్రారంభానికి నిర్ణయం తీసుకుంది.

ఉపాధ్యాయ ఆన్‌లైన్ పరీక్ష వాయిదా

నెల్లూరు(విద్య), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాల, గూడూరులోని పొట్టిశ్రీరాములు అప్పర్ ప్రైమేరీ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించాల్సిన ఆన్‌లైన్ పరీక్షను వాయిదా వేసినట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్ర, శనివారాల్లో జరగాల్సిన ఈ పరీక్షను సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా వాయిదా వేశామని, తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ అధికారులు

నృసింహుడి హుండీల లెక్కింపు

రాపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలోని స్వామి, అమ్మవారు, ఆంజనేయ స్వామి ఆలయాలలో ఉన్న హుండీలను గురువారం లెక్కించారు. రూ. 28,84,901 నగదు రాగా, నిత్యాన్నదానం హుండీలో రూ. 5,46,505 ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ ఈవో పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ హుండీల లెక్కింపు జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్ పర్యవేక్షణలో జరిగింది. లెక్కింపులో ప్రధాన అర్చకులు, పెంచలకోన అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్, సిబ్బంది, భ్రమరాంబిక సేవా సిబ్బంది బృందం పాల్గొన్నారని ఆలయ డిప్యూటీ ఈవో తెలిపారు.

'ఎన్టీఆర్ వైద్యసేవ'తో మెరుగైన వైద్య సేవలు

నెల్లూరు (వైద్యం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆ పథకం జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్కరకు రాని ఆరోగ్యశ్రీ శీర్షికతో ఈ నెల 23న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. రోగుల నుంచి ఆసుపత్రులు డబ్బు వసూలు చేసే అవకాశం లేకుండా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినా వైద్య మిత్ర లాగిన్‌లో రోగి ఆధార్ నెంబరు ఆధారంగా ఉచిత వైద్య సేవలు పొందే అవకాశం ఉందన్నారు. బీపీఎల్ కుటుంబాలు అయుండి ఆన్‌లైన్‌లో డేటా లేని వారు రేషన్‌కార్డుగానీ, తహసీల్దారు నుంచి బీపీఎల్ సర్టిఫికెట్‌గానీ తీసుకువస్తే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం లెటర్ ద్వారా ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచిత వైద్య సేవలు అందిస్తామని వివరించారు.

ఈత నేర్చుకుంటూ బాలిక దుర్మరణం

నెల్లూరు(క్రైం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ఈత నేర్చుకుంటూ ప్రమాదవశాత్తు బాలిక మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు, నెల్లూరులోని సప్తగిరి లేఅవుట్‌లో వంశీకృష్ణ, ఆదిలక్ష్మి దంపతులు ఉంటున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె మనస్వి(9) వెంకటాచలంలోని ఓ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. కుమార్తెకు ఈత నేర్పించేందుకు తల్లిదండ్రులు బుధవారం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫీజు చెల్లించారు. గురువారం సాయంత్రం బాలికను స్విమ్మింగ్‌ఫూల్ వద్దకు తల్లిదండ్రులు తీసుకువచ్చి వదిలారు. అక్కడ ఏమైందో తెలియదు కానీ సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో సిబ్బంది తల్లిదండ్రులకు ఫోన్ చేసి, ఈత నేర్చుకుంటుండగా బాలికకు ఫిట్స్ రావడంతో శ్వాస తీసుకోలేకపోయిందని, బొల్లినేని వైద్యశాలకు తీసుకెళ్లామని చెప్పారు. తల్లిదండ్రులు హుటాహుటిన వైద్యశాలకు వెళ్లేలోపే మనస్వి మృతిచెందింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలిపించారు. స్విమ్మింగ్‌ఫూల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే పాప మృతిచెందిందని, స్విమ్మింగ్‌ఫూల్‌లో సరైన జాగ్రత్తలు తీసుకోక పోవడంతోనే ఇలా జరిగిందని ఆరో పించారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రీసర్వేను వేగంగా పూర్తి చేయండి

- డీఆర్వో ఉదయభాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నెల్లూరు డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద 11 గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు తహసీల్దారులు, సర్వేయర్లు చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వేలోని అన్ని దశలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీవో అనూష, జిల్లా భూ సర్వే రికార్డుల ఏడీ వై నాగశేఖర్, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సినీ హీరోనంటూ మోసం

నెల్లూరు(క్రైం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో సినీ హీరోనంటూ పరియం చేసుకున్నాడు...పెళ్లి చేసుకుంటా అంటూ నమ్మించాడు.. చివరికి ఆ మహిళను మోసం చేశాడు. ఆ వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు తిరుపతి జిల్లా కోట మండలానికి చెందిన ఓ మహిళ భర్త నుంచి విడిపోయింది. ప్రస్తుతం నెల్లూరు రెయిన్‌స్పైర్ సమీపంలోని ఓ వైద్యశాలలో పనిచేస్తూ కేవీఆర్ పెట్రోలుబంకు సమీపంలోని లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో సునీల్‌రెడ్డి సినీహీరోనంటూ పరిచయం అయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈ ఏడాది జనవరి 1న నగరంలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి ఆమెను లోబరుచుకున్నాడు. గత నెల 18న మరోసారి హోటల్‌కు తీసుకువెళ్లగా పెళ్లిచేసుకోమని ఆ మహిళ బలవంతం చేసింది. దీంతో తన సినిమా సగంలో ఆగిపోయిందని, ఆస్తి బ్యాంకులో తాకట్టు పెట్టి నగదు తీసుకురావాలని ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో ఆమెతో సన్నిహితంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలు బయటపెడతానని బెదిరించి ఆమె వద్ద నుంచి రూ.లక్ష నగదు తీసుకున్నాడు. ఇటీవల దాడిచేయడంతో ఆమె ఆత్మహత్యాయత్నానిక పాల్పడి ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. సునీల్‌రెడ్డికి వివాహం అయి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఆమెకు తెలిసింది. తనను పెళ్లిచేసుకుంటానని నమ్మించి మోసం చేసిన సునీల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆమె గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

వింజమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాటేపల్లి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ కృష్ణమోహన్ గురువారం విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీపీఓ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లను విచారణ చేసినట్లు తెలిపారు. రికార్డుల పరిశీలన అనంతరం నివేదికను డీపీఓకి అందజేస్తామని, తదుపరి చర్యలు జిల్లాస్థాయి అధికారులు తీసుకుంటా రని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ. పీఆర్‌డీ గోపిసాయి, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎల్‌వో కృష్ణమోహన్

నేడు ఇఫ్తార్ విందు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6గంటలకు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించ న్నుట్లు ఆ శాఖ డీడీ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ముస్లింలు, ఇతర నేతలంతా హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉగాది బ్రోచర్ల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 27 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో ఈనెల 30న జరిగే ఉగాది వేడుకల బ్రోచర్‌ను గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉగాది వేడుకల్లో భాగంగా ఈ నెల 30న రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకారం, ఉగాది పచ్చడి నివేదన నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 10గంటలకు మామిడిపూడి హరిహరశర్మ పంచాంగ పఠనం ఉంటుందని తెలిపారు. రాత్రి అమ్మవారికి పులివాహనంపై ప్రాకారసేవ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రఘురామమూర్తి, కోడూరు కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో ఉగాది వేడుకల బ్రోచర్లను ఆవిష్కరించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి



హమీద్ మృతదేహం

అనంతసాగరం మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి వద్ద జాతీయ రహదారి 565పై గురువారం రెండు మోటారు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో అనంతసాగరంకు చెందిన షేక్ హమీద్ (34) మృతి చెందాడు. షేక్ హమీద్ యకర్లపాడుకు వెళ్లి తిరిగి స్వగ్రా మానికి వస్తుండగా బద్వేల్ వైపు వెళ్తున్న మోటారుబైక్ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమశిల పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు

- రూ.22వేల జరిమానా

నెల్లూరు (లీగల్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో కార్యం అంకయ్య అనే నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాయుడుపేట పట్టణం శ్రీరాం నగర్‌లో 2019 ఏప్రిల్ 28న తొమ్మిదేళ్ల బాలిక ఆడుకుంటుండగా నిందితుడు అంకయ్య ఆ బాలికను తన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నాయుడుపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.

క్వారీ గుంతలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కలువాయి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి క్వారీ గుంతలో మునిగి గల్లంతైన కేశమనేనిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన ఏలూరు పెంచలప్రసాద్ మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. గజ ఈతగాళ్లను పిలిపించి క్వారీ గుంతలో ఇరుకున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

పెళ్లి చేసుకుని మోసం చేశాడని

యువకుడి ఇంటి ముందు యువతి ధర్నా



యువకుడి ఇంటి ముందు బైఠాయించిన లక్ష్మి

సంగం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని.. అనంతరం తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదంటూ వదిలేసి మోసం చేశాడని ఓ యువతి యువకుడి ఇంటి ముందు బైఠాయించి ధర్నాకు దిగిన సంఘటన మండల కేంద్రమైన సంగంలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సంగం గ్రామానికి చెందిన షేక్ మన్సూర్ వింజమూరులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదివాడు. అదే సమయంలో బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామానికి చెందిన అద్దంకి లక్ష్మి అనే గిరిజన యువతి అదే కాలేజీలో ఇంజనీరింగ్ చదివింది. వీరిద్దరూ స్నేహితులుగా మారారు. చదువు పూర్తయిన తరువాత లక్ష్మి చెన్నైలో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరింది. మన్సూర్ హైదరాబాద్‌లో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఈక్రమంలో లక్ష్మి కూడా హైదరాబాదుకు బదిలీ చేయించుకుంది. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే పెళ్లి చేసుకోకుండా ఇద్దరూ ఒకే గదిలో ఏడాదిపాటు సహజీవనం చేశారు. ఆ తరువాత యువతి తనను పెళ్లి చేసుకోవాలని కోరడంతో అందుకు యువకుడు తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోవడం లేదని చెప్పి మూడు నెలల కిందట ఆమెను వదిలేసి స్వగ్రామానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న యువతి గిరిజన సంఘాల సహాయంతో సంగం వచ్చి పోలీసులను ఆశ్రయించింది. దీంతో హైదరాబాద్‌లోనే కేసు పెట్టాలని పోలీసులు సూచించడంతో గిరిజన సంఘాలతో కలసి హైదరాబాద్‌లో కేసు పెట్టింది. అక్కడి పోలీసులు మన్సూర్‌ను హైదరాబాద్‌కు పిలిచి విచారించడంతో పెళ్లికి ఒప్పుకుని పోలీస్ స్టేషన్‌లో దండలు మార్చుకున్నారు. అనంతరం గిరిజన సంఘాల పెద్దల సమక్షంలో అక్కడే ఓ గుడిలో వివాహం చేసుకున్నారు. రెండు నెలలపాటు కాపురం చేశారు. ఈక్రమంలో వారం రోజుల కిందట యువతిని ఇంట్లో ఒంటరిగా వదిలేసి వచ్చేశాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని రావడంతో యువతి వెతుకులాడుకుంటూ యువకుడి స్వగ్రామం సంగం వచ్చి తల్లిదండ్రులను కలవగా మాకు సంబంధం లేదని చెప్పి ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. దీంతో యువతి అతని ఇంటి ముందు బైఠాయించి తనకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి వెళ్లేది లేదని ధర్నాకు దిగింది. తనకు భర్త కావాలని... లేకుంటే చావుకైనా సిద్ధమంటోంది. ఈ విషయంపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు నాగేశ్వరరావు, రాధ

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవారిపల్లి గ్రామంలో ఇరు కుటుంబీకుల మధ్య జరిగిన దాడిలో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అంద్రా నాగేశ్వరరావు, శేషాద్రిలు అదే గ్రామంలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో శేషాద్రి మరో వ్యక్తితో వివాదం పడుతుండగా నాగేశ్వరరావు అడ్డువెళ్లి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం పాతకక్షలు, ప్రస్తుత వివాదాన్ని మనసులో పెట్టుకుని శేషాద్రి తన కుటుంబ సభ్యులతో కలిసి నాగేశ్వరావు ఇంటికెళ్లి అతను, అతని భార్య రాధపై ఇనుక రాడ్‌లతో దాడిచేశారు. ఈ దాడిలో గాయపడ్డ భార్యాభర్తలను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శేషాద్రి సైతం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు వైద్యశాలకు చేరుకొని వివరాలు సేకరించారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8488
వెండి కిలో ధర	రూ.1,02,000
వెండి ఒక గ్రాము	రూ.105.00

సమాజానికి మార్గదర్శకం చేసేదే నాటకం

● పినాకినీ యూత్ మురళీమోహన్‌రాజు

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : విజ్ఞానం, వినోదంతోపాటు సాంఘిక దురాచారాలపై సమాజానికి మార్గదర్శిగా నాటకాలు ఉన్నాయని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కే మురళీమోహన్‌రాజు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో బాలాజీనగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో గురువారం ప్రపంచ నాటక దినోత్సవం జరిగింది. కోవూరుకు చెందిన రంగస్థల కళాకారుడు పొట్లదుర్తి బుజ్జయ్యను సత్కరించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ విశ్రాంత ఉప కమిషనర్ రాచపాలెం రఘు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'స్కిల్ కనెక్ట్' కంప్యూటర్ శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : స్కిల్ కనెక్ట్ ఆధ్వర్యంలో కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని ఆ సంస్థ జిల్లా మేనేజర్ డీ ఆంజనేయులు నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసుకున్న వారికి రెండు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అన్నప్రసాద వితరణ

నెల్లూరు(విద్య), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వాసుపత్రిలోని సత్యసాయి సేవా ట్రస్ట్‌లో అన్నప్రసాద వితరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింత అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుడు అక్కులూరి శ్రీనివాసులురెడ్డి మనవడు సిద్దార్థరెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బెట్టింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

● సిటీ డీఎస్పీకి వైసీపీ వినతి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బెట్టింగ్ మాఫియా ఊబిలో చిక్కుకుని అనేక మంది యువత పెడదోవ పడుతోందని, బెట్టింగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున కోరారు. ఈ మేరకు నగర డీఎస్పీ సింధుప్రియకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. నెల్లూరులో బెట్టింగ్ మాఫియా జోరుగా సాగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సరస్వతీ సమాజంలో 30న ఉగాది వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట సరస్వతీ సమాజం గ్రంథాలయంలో ఈనెల 30న ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు మాచవోలు భాస్కర్‌శర్మ పంచాంగ శ్రవణం చేస్తారని, బత్తిన సాయి కుమార్‌రెడ్డి ఉగాది పండుగ విశిష్టతపై ప్రవచిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా మెట్టు రామచంద్ర ప్రసాద్ హాజరవుతారని, ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

హుండీ లెక్కింపు



లెక్కింపులో పాల్గొన్న గ్రామస్థులు, అధికారులు

వెంకటాచలం,మార్చి 27(ఆంధ్రజ్యోతి): పూడిపర్తి రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో రూ.1.10లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియను కొండ్లపూడి ఆలయ ఈవో కేవీపీ ప్రసాద్, పూడిపర్తి రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో ఎన్.శ్రీధర్‌నాయుడు, వీఆర్వో భగవాన్‌లు పర్యవేక్షించారు.

ఏప్రిల్ నుంచి రీసర్వే

మనుబోలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మనుబోలు, మడమనూరు గ్రామాల్లో ఏప్రిల్ నుంచి రీసర్వే ప్రారంభం కానున్నట్లు గురువారం తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య తెలిపారు. ఈ విషయంపై స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. సర్వేకు రైతులు సహకరించాలన్నారు. గత ప్రభుత్వంలో రెండు గ్రామాల్లో డ్రోన్ సహాయంతో సర్వే చేసినా ప్రభుత్వం నుంచి మ్యాప్‌లు, సంబంధిత ఫైళ్లు రాక ఈ రెండు గ్రామాల్లో రీసర్వే చేయలేదన్నారు. రైతులు ముందస్తుగా వీఆర్వోల వద్ద రెండు ఫొటోలు, ఆధార్‌కార్డులు, భూ పత్రాల నకళ్లు ఇచ్చి సహకరించాలన్నారు. రైతులు సహకరిస్తే రీసర్వే తప్పులు లేకుండా పారదర్శకంగా వేగవతంగా పూర్తవుతుందన్నారు. పిడూరు రీసర్వే ప్రశాంతంగా పూర్తి చేశామన్నారు. ఏవైనా సమస్యలుంటే రీసర్వే జరిగే సమయంలోనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

తోటపల్లిగూడూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):ఇందుకూరుపేట మండలంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో పట్టుబడిన 6ద్విచక్ర వాహనాలకు ఏప్రిల్ 3న గురువారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ నెల్లూరు ఎక్సైజ్ శాఖ అనుమతితో వేలం నిర్వహించనున్నట్లు ఇందుకూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆసక్తిఉన్నవారు వేలంలో టెన్‌పర్సంట్ దరావత్తు చెల్లించి పాల్గొనాలని చెప్పారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ ఆధార్, పాన్‌కార్డు తదితర వివరాలతో వేలంలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు ఇందుకూరుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

నుడా నిధులతో పార్కుల అభివృద్ధి

● చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ద్వారా నిధులను సమీకరించి పార్కులను అభివృద్ధి చేయబోతున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం 38వ డివిజన్ పరిధిలోని శోధన్‌నగర్ పార్కు స్థలాన్ని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అతి త్వరలో పార్కులను ఆహ్లాదకరంగా తయారు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా, రూరల్లోని మార్కండేయ కాలనీలో గిరిధర్‌రెడ్డి గడప గడప కార్యక్రమం నిర్వహించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు.



పార్కును పరిశీలిస్తున్న శ్రీనివాసులురెడ్డి, గిరిధర్‌రెడ్డి

లోతట్టు వాసులను ప్రత్యామ్నాయ ఇళ్లలోకి తరలించండి

కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో కాలువ గట్లు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ఇప్పటికే కేటాయించిన ప్రత్యామ్నాయ ఇళ్లలోకి తరలించి అక్కడ సౌకర్యాలన్నీ కల్పించాలని నగర కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. గురువారం 53వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అక్కడ ఇళ్లు కేటాయించిన వారందరినీ తరలించాలని సూచించారు. టిడ్కో, ఇతర గృహాలను పూర్తి చేసి వారికి అందించాలన్నారు. అక్కడే రేషన్ సరుకులు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ సదుపాయాలన్నీ కల్పించాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. ఆ తర్వాత కార్యాలయంలో మార్కెట్లు, పశువుల గంజిఖానాలకు రెవెన్యూ అధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు.

రంజాన్ తోఫా పంపిణీ



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 27 (ఆంధ్ర జ్యోతి) : రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలో రాంజీనగర్‌లోని తన కార్యాలయంలో గురువారం ఇమామ్‌లు, మౌజన్లకు రంజాన్ తోఫాను అందజేశారు. ఇందులో వస్త్రాలు, పౌష్టికాహారం ఉంటాయని, ఈ కిట్‌ను ప్రతీ మసీదుకు అందజేస్తామని చెప్పారు. ఈ కార్య క్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అలరించిన ఉగాది పద్య కవి సమ్మేళనం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గోవిందరాజు సాహితీ వేదిక ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఉగాది పద్య కవి సమ్మేళనం జరిగింది. పలువురు కవులు ఉగాదిపై పద్యాలు వినిపించారు. అదే వేదికపై సంగీత విద్వాంసుడు బాలకృష్ణప్రసాద్ సంతాప సభ కూడా జరిగింది. ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన చేసిన సంగీత సేవను స్మరించారు. లక్ష్మీకామాక్షి, హర్షవర్ధిని తదితరులు అన్నమయ్య సంకీర్తనలను మధురంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో డీ గిరిజాలక్ష్మి, పోలవరపు నరసింహారావు, అవధాని మురళీకృష్ణ, నరసింహమూర్తి, ఇంద్రగంటి మధుసూదన్ రావు, పెరిశెట్ల శివకుమార్, సుహాసినీ పాల్గొన్నారు. వారిని కార్యక్రమ నిర్వాహకురాలు గోవిందరాజు సుభద్రాదేవి సత్కరించింది.



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీకామాక్షి, హర్షవర్ధిని

కేంద్ర మంత్రికి ఎంపీ వేమిరెడ్డి పరామర్శ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ తండ్రి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ దేబేంద్ర ప్రధాన్ ఇటీవల కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం తల్చేరులోని కేంద్ర మంత్రి ఇంటికి ఎంపీ వేమిరెడ్డి వెళ్లి దేబేంద్ర చిత్రపటానికి నివాళులర్పించారు.

సాయిదర్బార్‌లో రేపటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బాలాజీనగర్‌లోని సాయిదర్బార్‌లో శనివారం నుంచి ఏప్రిల్ 5వతేదీ వరకు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ మందిరం అధ్యక్షుడు మధుసాయి తెలిపారు. ఈ ఉత్సవాల కరపత్రాలను గురువారం మందిరంలో ఆవిష్కరించారు. ఈ వారం రోజులు నిర్విరామంగా అఖండ సాయి నామ సంకీర్తన, అఖండ జ్యోతి ప్రజ్వలన జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వతేదీ సాంస్కృతిక కార్యక్రమాలు, 6వతేదీ శ్రీరామ నవమి సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు, సీతారామ కళ్యాణం, అన్నసంతర్పణ, రాత్రి గంధమహోత్సవం జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు తరలిరావాలని కోరారు.

జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలకు కృషి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ● నూతన ఓపీ విభాగం ప్రారంభం

నెల్లూరు (వైద్యం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)లో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో రూ.15 లక్షల వ్యయంతో గర్భకోశ వ్యాధుల విభాగంలో నిర్మించిన ఓపీ విభాగాన్ని ఆయన గురువారం ఆసుపత్రి కో ఆర్డినేటర్ శ్రీనివాసులు గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేదలకు అంకితభావంతో చికిత్స చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వీర బ్రహ్మారెడ్డి, మొగరాల సురేష్, దారా మల్లి, అబిదా సుల్తానా, సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, డీసీ మహేశ్వరరెడ్డి, ఏవో ఏడుకొండలు పాల్గొన్నారు.



నర్సింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఆ భూములను నోషనల్ ఖాతా నుంచి విడుదల చేయాలి

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలంలోని 18 గ్రామాల రైతులకు చెందిన భూములను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, కనీస సమాచారం లేకుండా నోషనల్ ఖాతాలో పెట్టారని, వాటిని వెంటనే ఆ ఖాతా నుంచి విడుదల చేయాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి గురువారం జేసీ కార్తీక్‌కు లేఖ రాశారు. నోషనల్ ఖాతాలో పెట్టడం వల్ల రైతులు వారి అవసరాల నిమిత్తం భూములను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నార న్నారు.

ఫ్లెక్సీలు వద్దు

నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించే ఫ్లెక్సీలను దేవస్థానాలు, మసీదుల వద్ద ఏర్పాటుకు చేసేందుకు అనుమతి ఇవ్వవద్దని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన కార్యాలయంలో నగర కమిషనర్ సూర్యతేజ, డీఎస్పీ సింధుప్రియ, ఇతర అధికారులతో రంజాన్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నగర పరిధిలోని ఈద్గాలు, మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డీడీ ఎం శ్రీనివాసరావు, ఈద్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద మహాధర్నా

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు (వైద్యం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై శనివారం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాచైతన్య యాత్రలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. ముత్తుకూరు మండలం పైనాపురంలో గ్రామస్తులు కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అలాగే ఇందుకూరుపేట మండలంలో శ్మశాన వాటిక కు రూ.10 కోట్లు వస్తే పనులు సకాలంలో చేయకపోవడం వల్ల ఆ నిధులు వెనక్కు వెళ్లిపోయాయని ఆరోపించారు. సీతారామపురం, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న మహాధర్నాకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివసరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీ కార్యాలయం

● ప్రారంభించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.97.50లక్షలతో నిర్మించిన నూతన ఏడీ కార్యాలయ భవనాన్ని గురువారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలోని పలు గదులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో విద్యుత్ పరికరాల కొనుగోలు విషయంలో భారీ అవినీతి జరిగిందని, ఒక్క పొదలకూరు మండలంలోనే 67 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురయ్యాయని, 42ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయినా పట్టించుకున్న నాథుడు లేడన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేత కార్మికులకు 200యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆక్వారంగానికి రూ.1.50లకే యూనిట్‌విద్యుత్ ఇచ్చేలా సీఎం చంద్రబాబు ప్రకటించారని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహమ్మదాపురం, విరువూరు పంచాయతీలకు మంజూరైన చెత్త తరలింపు ట్రాక్టర్లను అందజేశారు. ధాన్యంను మధ్య దళారులకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వ గిట్టుబాటు ధర పుట్టీ రూ.19,750లకు రైతులు అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ సోమశేఖర్‌రెడ్డి, పొదలకూరు డీఈ సుబ్రహ్మణ్యం, మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, మహిళా మండలాధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, నాయకులు కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, జమీర్‌బాషా, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, డేగ యశ్వంత్ రెడ్డి, ఆదాల మురళీరెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

చట్టాలపై అవగాహన ఉండాలి

● న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

● నక్కల గిరిజనకాలనీ, జిల్లా కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు

వెంకటాచలం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చట్టాలపైన గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ నక్కల గిరిజనకాలనీలో గురువారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రేషన్, ఆధార్ కార్డులు ఉన్నాయా అడిగి తెలుసుకుని ఫోక్సో చట్టం, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని, ఒకవేళ చదివించలేని పిల్లలకు తామే మంచి పాఠశాలలో చేర్పిస్తామన్నారు. గిరిజనులకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంపై నిబద్ధత కలిగి ఉండాలని సూచించారు. ఏవరో వస్తారు.. సహాయం చేస్తారు అని అనుకోవడం మంచిది కాదన్నారు. పేదలు న్యాయసేవాధికార సంస్థతో సలహాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక నేత దొడ్ల అశోక్ ఉన్నారు.

● తప్పులు మరలా చేయరాదు

తెలిసోతెలియకో చేసిన తప్పులు మరలా చేయరాదని, బయటకు వెళ్లిన తర్వాత మంచిగా బతకి కుటుంబసభ్యులతో సంతోషంగా ఉండేలా చూసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి సూచించారు. చెముడుగుంట సమీపంలోని జిల్లాకేంద్రకారా గారంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు. ఖైదీల యోగాక్షేమాలు వారి కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసేవలను ఖైదీలు వినియోగించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకసెల్ ఏర్పాటు చేశామన్నారు.



నక్కల గిరిజన కాలనీలో అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

రేపు మనుబోలు మండల సమావేశం

మనుబోలు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జలజాక్షి గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వ్యవసాయ, నీటిపారుదల, ఉపాధిహామీ, గృహనిర్మాణ, వెలుగు, వైద్య, మహిళా శిశు సంక్షేమ, విద్యుత్‌శాఖల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

నిరుపయోగంగా కొత్త బ్రిడ్జి?

● ప్రమాదపుటంచుల్లో శిథిల బ్రిడ్జిపైనే ప్రయాణం

● ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహనదారుల ఆందోళన



కట్టుబడిపాళెం శివారు ప్రాంతంలోని పాత, కొత్త బ్రిడ్జిలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబడిపాళెం శివారు ప్రాంతంలోని అల్లూరు కాలువపైన రెండేళ్ల కిందట కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయిన అధికారులు దీన్ని ప్రారంభించలేదు. చేసేదిలేక ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు బ్రిటీష్ హయాంలో నిర్మించిన బ్రిడ్జిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట నిర్మించిన బ్రిడ్జి పగుళ్లిచ్చి శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని కట్టుబడిపాళెం, రామచంద్రాపురం ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా వున్న కొత్త బ్రిడ్జిని ఉపయోగంలోకి తీసుకరావాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోరుతున్నారు.

ధాన్యం అమ్మకాలపై అవగాహన కల్పించలేదు

● వవ్వేరు సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశం ● అధికారుల నిలదీత

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యంను ఎందుకు తోలడంలేదో తెలుసుకోవడం కానీ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపైన అవగాహన కల్పించడం కానీ చేయలేదని చిన్న, సన్నకారు రైతులు నిలదీశారు. గురువారం బుచ్చిలోని వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకులో జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న పలువురు రైతులు బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. అధికారులు మద్దతు ధర చెప్పడం తప్ప, కొనుగోలు కేంద్రాల్లో గోతాలు, నెమ్ముశాతం, వాహనాలు, ట్రక్కుషీట్లు ఇలా ఎన్నో సమస్యలు తలెత్తాయని వాపోయారు. కొంతసేపు రైతులు, అధికారుల మధ్య గందరగోళ వాతావరణం నెలకొంది. అనంతరం సహకార బ్యాంకు సీఈఓ ఎం.శ్రీనివాసులు మాట్లాడారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు విషయంలో న్యాయం చేయగలిగామని చెప్పి సమావేశాన్ని ముగించేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

నివాసమున్న వార్డులోనే ఓటుహక్కు ఉండాలి

● బీఎల్‌వోకు తహసీల్దారు, కమిషనర్ ఆదేశం

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీతో పాటు మండలంలో ఏ గ్రామంలోనైనా ఏ వార్డులో నివసాముంటే వారికి ఆ వార్డు పరిధిలోని పోలింగ్ బూత్‌లోనే ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలను తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, కమిషనర్ బాలకృష్ణ ఆదేశించారు. గురువారం బుచ్చిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు నమోదుపై బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశం తహసీల్దారు మాట్లాడారు. 18ఏళ్లు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించాలని కోరారు. ఓటరు నమోదుకు ఆధారాలను నిసితంగా పరిశీలించి నమోదు చేయాలని వివరించారు.

భక్తిశ్రద్ధలతో షబేబరాత్

● రాత్రంతా జాగరణతో ముస్లింల ప్రార్థనలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసంలో షబే బరాత్ వేడుకలను ముస్లింలు మసీదుల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జాగరణ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు సైతం ఇళ్లలో జాగరణ చేస్తూ ఖురాన్ పఠనం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేపట్టిన వారు ఈ షబే బరాత్ రోజున రాత్రంతా జాగరణ కాస్తే పుణ్యఫలం లభిస్తుందని చెప్పారు.

ఉపాధి హామీ పనులపై బహిరంగ విచారణ

దగదర్తి (బిట్రగుంట), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24లో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై గురువారం మండల కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ గంగాభవానీ ఆధ్వర్యంలో అధికారులు బహిరంగ విచారణ చేపట్టారు. మండలంలోని 20పంచాయతీలకు సంబంధించిన పనుల్లో రూ.6.83లక్షల అవినీతి జరిగినట్లు గుర్తించారు. వీటిపై అధికారులు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ మృదుల, డీఈవో విజయలక్ష్మీ, అంబుడ్స్‌మేన్ వెంకటరెడ్డి, ఎస్‌టీఎం కోనయ్య, ఆవులయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ సర్పంచులు ఉన్నారు.

చెన్ను బాలకృష్ణారెడ్డికి ఘన నివాళి



చెన్ను బాలకృష్ణారెడ్డికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

రాపూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చెన్ను బాలకృష్ణారెడ్డి వర్ధంతి గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పలువు రు నాయకులు, అధికారులు, చెన్ను అభిమానులు నివాళులర్పించారు. అ నంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వ హించారు. కార్యక్రమంలో రాపూరు మాజీ సొసైటీ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు చిగురుపాటి ప్రసన్న, ఎంపీడీఓ భవాని, నాయకులు నువ్వుల శివరామకృష్ణ, కొండ్లపూడి రాఘవరెడ్డి, నల్లవ డ్ల వెంకటరమణరెడ్డి, చెన్ను పెంచలరెడ్డి, చెన్ను అభిమానులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 28 మార్చి 2025



జాతరలో భక్తజన సందోహం



పూజలందంకుంటున్న పోలేరమ్మ

బంగారు చీర అలంకారంలో ముత్యాలమ్మ

కనుపూరు జాతరకు పోటెత్తిన భక్తజనం

చిల్లకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతరకు జనం పోటెత్తారు. మూడో రోజైన గురువారం అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచీ భక్తులు తరలి వచ్చారు. దీంతో తూర్పుకనుపూరు, కోట, సిద్ధవరం మార్గాలలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ముత్యాలమ్మ ఆలయం, పోలేరమ్మ గుడి వద్ద అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల రాకతో తూర్పుకనుపూరు జనసంద్రంలా మారింది. ప్రధానంగా భక్తులు ఎండ వేడిమికి తట్టుకోలేకపోయారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నివాసాల్లో, చెట్ల కింద సేద తీరారు. ఇక, వేయికండ్ల కుండలను భక్తులు నెత్తిన పెట్టుకుని గుడిపైకి కోడి పిల్లలు, చీరలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మతో పాటు గంగమిట్ట మీద ఉంచిన పోలేరమ్మకు కూడా పొంగళ్లు పెట్టుకున్నారు. గురునాథస్వామి, అంకమ్మకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పరవశంతో నృత్యాలు చేశారు. అనంతరం గంగమిట్ట సమీపంలో రెండు తాటిచెట్ల మధ్య వేసిన ఉయ్యాలలో పోలిశెట్టి, గణాచారులు అమ్మణ్ణికి ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు నిర్వహించారు.

నేటితో ముగియనున్న జాతర

గంగమిట్ట మీద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలేరమ్మ అమ్మవారిని నాలుగో రోజైన శుక్రవారం ఉదయం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించనున్నారు. దీంతో జాతర ముగుస్తుంది.

తిరుపతికి చేరిన 'గుండె'

తిరుపతి(వైద్యం), మార్చి 27(ఆంధ్రజ్యోతి): మరొకరికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయడానికి గుంటూరు నుంచి 'గుండె'ను తీసుకొచ్చారు. గుంటూరులో రోడ్డు ప్రమాదానికి గురైన సుష్మ(48) బ్రెయిన్ డెడ్ కావడంతో.. ఆమె గుండెను తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 53 ఏళ్ల వ్యక్తికి అమర్చేందుకు చర్యలు చేపట్టరు. ఈ మేరకు శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తన బృందంతో వెళ్లి గుండెను సేకరించి గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక విమానంలో గురువారం రాత్రి 9.38 గంటలకు విమానాశ్రయానికి.. ప్రత్యేక అంబులెన్సులో 9.59 గంటలకు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉన్న వైద్య బృందం ఆ గుండెను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లింది. ఈ శస్త్ర చికిత్స పూర్తయ్యేందుకు 6 నుంచి 8 గంటల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ఇప్పటి వరకు 18 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం 19వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్నారు.



ఆస్పత్రి ముందు భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు



అంబులెన్సులో నుంచి ఆస్పత్రిలోకి గుండెను తీసుకెళుతున్న వైద్య సిబ్బంది

వేసవిలో బ్రేక్ దర్శనాల కుదింపు!

● సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించేలా టీటీడీ కసరత్తు

తిరుమల, మార్చి27(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించేలా బ్రేక్ దర్శనాలను కుదించేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది. ఏపీతో పాటు ఇటీవల తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపైనా టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనాలకు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం శుక్ర, శనివారాల మినహా మిగిలిన అన్ని రోజులకు సిఫార్సులపై వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు జారీ చేస్తున్నారు. దీంతో పాటు సీఎంవోలు, కేంద్రమంత్రులు, టీటీడీ బోర్డు, శ్రీవాణిట్రస్టు, న్యాయశాఖ, పోలీసు, ఐఏఎస్, ఐపీఎస్, ప్రెస్, ఇన్‌కమ్‌ట్యాక్స్ ఇలా వివిధ విభాగాలు, అధికారుల సిఫార్సులపై, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు బ్రేక్ దర్శనాలు ఇస్తున్న క్రమంలో ఉదయం ప్రారంభమవుతున్న బ్రేక్ దర్శనాలు మధ్యాహ్నం వరకు కొనసాగుతున్నాయి. కొంతమంది టీటీడీపై ఒత్తిడి చేసి అదనపు కోటాలో కూడా టికెట్లు పొందుతున్నారు. ఇదే పరిస్థితి వేసవిలోనూ కొనసాగితే సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని భావిస్తున్న టీటీడీ బ్రేక్ దర్శనాల కుదింపుపై కసరత్తు మొదలుపెట్టింది. రానున్న పది రోజుల్లో బ్రేక్ దర్శనం సమయాన్ని తగ్గించే అంశంపై ఉన్నతాధికారులు సమీక్షించనున్నారు. వేసవి సెలవుల్లో ప్రతి రోజు సర్వదర్శనం క్యూ లైన్ వెలుపలే ఉండే క్రమంలో సిఫార్సుపై లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను పూర్తిస్థాయిలో రద్దు చేసి బ్రేక్ దర్శనాన్ని కేవలం ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకే పరిమితం చేసేలా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఇన్విజిలేటర్‌ను బెదిరించిన యువకులపై పోలీసులకు ఫిర్యాదు

తిరుపతి(విద్య), మార్చి 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు కాపీకి పాల్పడకుండా అడ్డుకున్న ఓ ఇన్విజిలేటర్‌ను బెదిరించిన యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. 'ఎస్ రామాపురం ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ డి. మురుగేషన్ ఈనెల 24న పిచ్చాటూరు- ఎ సెంటర్ జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో టెన్త్ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా పనిచేశారు. కాపీకి యత్నించిన విద్యార్థులను మందలించి.. అలాంటి అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విధుల అనంతరం ఆయన తిరుగు ప్రయాణంలో కీలపూడి వద్ద కొందరు యువకులు ఆయన్ను అడ్డగించి బెదిరించారు. భయాందోళనకు గురైన మురుగేషన్ ఆస్పత్రిపాలయ్యారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పిచ్చాటూరు ఎంఈవోను ఆదేశించాం' అని డీఈవో వివరించారు. ఆ మేరకు ఆయన ఫిర్యాదు చేశారన్నారు. పదో తరగతి పరీక్షల్లో నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు విద్యాశాఖ అండగా ఉంటుందని, ఎవరూ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గరాదని డీఈవో స్పష్టం చేశారు.

కాలం చెల్లిన మందుల విక్రయం

● డ్రగ్స్ అధికారుల తనిఖీల్లో వెలుగుచూసిన వైనం
● మూడు షాపుల సీజ్ ● హోమియో మందుల షాపుపై కేసు నమోదు

పుత్తూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని ఆరు మెడికల్ షాపుల్లో గురువారం తిరుపతి డివిజన్ డ్రగ్స్ అధికారిణి రీతు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో మూడు షాపులను సీజ్ చేశారు. ఈ షాపుల్లో బిల్లులు ఇవ్వకుండా విక్రయించడం, ఫార్మసిస్టు లేకపోవడం, కాలం చెల్లిన మందులను విక్రయించడాన్ని గుర్తించారు. అదేవిధంగా షణ్ముగన్ హోమియో మెడికల్ షాపులో అనుమతులు లేని మూడు రకాల మందులను విక్రయిస్తుండటాన్ని గుర్తించారు. ఈ దుకాణంపై కేసు నమోదు చేసి కోర్టుకు నివేదించనున్నట్లు రీతు తెలిపారు. వీఆర్‌వో యశోద, ప్రభుత్వ ఫార్మసిస్టు అన్నాదొరై ఆమెకు సహకరించారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:52 (శనివారం ఉదయం)

ఎంపీపీ, రెండు ఉపసర్పంచుల ఎన్నిక ప్రశాంతం

● పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



నిర్మానుష్యంగా తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయ పరిసరాలు

తిరుపతిరూరల్/చంద్రగిరి/ఎర్రావారిపాళెం, మార్చి27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఒక ఎంపీపీ, రెండు ఉపసర్పంచుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి మూడు చోట్లా పరిస్థితిని బట్టి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుపతి రూరల్ ఎంపీపీగా వైసీపీకి చెందిన మూలం చంద్రమోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమకు తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో టీడీపీ తరఫున అభ్యర్థి పోటీలో లేరు. ఈ ఎన్నికల జరిగిన రూరల్ ఎంపీడీవో కార్యాలయం పరిసరాల్లో షాపులను మూయించేశారు. రాకపోకలను ఆపేశారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ముంబైలో క్యాంపులో ఉన్న వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఉదయాన్నే విమానంలో దిగారు. ప్రత్యేక బస్సులో వచ్చి ఓటేశారు. ఇక, చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె ఉపసర్పంచ్ ఎన్నికకు ఏడుగురు వార్డు సభ్యులు హాజరయ్యారు. వీరంతా టీడీపీ మద్దతుదారులైన వెంకటరమణను ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. ఇక, ఎర్రావారిపాలెం మండలం చింతగుంట ఉప సర్పంచ్‌గా వైసీపీ మద్దతుదారు జూపూడి అన్నపూర్ణ ఎన్నికయ్యారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరుకు కొత్తగా ప్రతిపాదనలు

డక్కిలి, మార్చి 27 : (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరుకు కొత్తగా ప్రతిపాదనలు పంపనున్నట్లు తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీరు వరప్రసాద్ వెల్లడించారు. సోమశిల -స్వర్ణముఖి కాలువ నిర్మాణంలో భాగంగా ఆల్తూరుపాడు వద్ద రిజర్వాయరు నిర్మాణాన్ని 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.400 కోట్ల అంచనాలతో రిజర్వాయరు నిర్మాణ పనులను ప్రారంభించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రిజర్వాయరు నిర్మాణ పనులను రీ టెండరు పేరుతో నిలిపివేసింది. తర్వాత టెండర్లు నిర్వహించినప్పటికీ 26 శాతం లెస్‌తో టెండర్ దక్కించుకొన్న ఓ కాంట్రాక్టరు పనులు పూర్తి చేస్తే నష్టం వస్తుందని భావించి ఆపేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం రిజర్వాయరు నిర్మాణ పనులను గాలికొదిలేసింది. ప్రస్తుతం రిజర్వాయరు నిర్మాణం చేపడతామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో ప్రకటించారు. ఈ క్రమంలో రిజర్వాయరు నిర్మాణం కోసం అంచనాలను తిరిగి పంపమని ప్రభుత్వం ఆదేశించడంతో చీఫ్ ఇంజనీరు వరప్రసాద్ రిజర్వాయరు ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. దీంతో ఈ ప్రాంత రైతుల్లో రిజర్వాయరుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణారెడ్డి, ఈఈలు విజయకుమార్ రెడ్డి, రామచంద్రమూర్తి, అనిల్ కుమార్ రెడ్డి, విజయరామిరెడ్డి, డీఈ తిరుమలయ్య, బాబు తదితరులున్నారు.



స్మార్ట్ మీటర్ల ఒప్పందాలు రద్దు చేయండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ -

తిరుపతి(ఆటోనగర్), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మీటర్ రీడర్స్ సమస్యలపై సదరన్ డిస్కం కార్యలయం ఎదుట గురువారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు అమర్చడానికి అదానీ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ హామీని వెంటనే అమలు చేయకపోతే వేలాది మంది మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు అమరిస్తే రాష్ట్ర ప్రజలపై లక్షా పదివేల కోట్ల రూపాయలు భారం పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని విస్తృతంగా ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయం నుంచి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.మురళి,విశ్వనాథ్, రాధాకృష్ణ, చిన్నం పెంచలయ్య, సురేష్‌బాబు, జయమణి, హజరత్‌వలీ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

ఇదేం తీరు?

పుంగనూరులో మంత్రి పర్యటన సందర్భంగా బయటపడ్డ ఎమ్మెల్యేల అసంతృప్తి



రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

పుంగనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేల అసంతృప్తి పార్టీ శ్రేణుల సాక్షిగా బయటపడింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణను అక్కడి వైసీపీ కార్యకర్త వెంకట్రమణ ఇటీవల నరికి చంపిన విషయం తెలిసిందే. గురువారం రామకృష్ణ పెద్దకర్మ కార్యక్రమం ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వెళ్లి రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలని పార్టీ ఆదేశించింది. దీంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి విజయవాడ నుంచి బెంగళూరు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో కృష్ణాపురానికి ఉదయం 9.50 గంటలకల్లా వెళ్లారు. ఉదయం 10 గంటలకు రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలనుకున్నా.. ఆ సమయానికి అక్కడికి జిల్లా ఎమ్మెల్యేలు చేరుకోలేదు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మాత్రమే మంత్రికి ఆహ్వానం పలికారు. అప్పటి వరకు మంత్రి అదే గ్రామంలోని ఓ కార్యకర్త ఇంటి వద్ద ఉంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. చిత్తూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్ పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని అక్కడే టిఫిన్ చేశారు. అక్కడి నుంచి బయల్దేరి 11.30 గంటలకు కృష్ణాపురం చేరుకున్నారు. అప్పటి వరకు మంత్రి వారి కోసం వేచి చూశారు. ఎమ్మెల్యేలు వస్తున్న సమయంలో మంత్రి పక్కనే ఉన్న చనిపోయిన రామకృష్ణ ఇంటి వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యేలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆహ్వానించారు.తరువాత మంత్రి, ఎమ్మెల్యేలంతా రామకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పించారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. తర్వాత ముందే ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్ శిబిరం వద్దకు చేరుకోవాల్సి ఉండగా.. ఇన్‌ఛార్జి చల్లా అందర్నీ పిలిచారు. మంత్రి ప్రెస్‌మీట్ వద్దకు చేరుకుని ఎమ్మెల్యేల కోసం మళ్లీ 10 నిమిషాల పాటు వేచి చూశారు. తొలుత మంత్రి 3 నిమిషాలు మాట్లాడారు. ఎమ్మెల్యేల తరఫున మాట్లాడాలని చిత్తూరు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కోరారు. దీంతో ఆయన కోప్పడ్డారు. 'మంత్రి మాట్లాడేశారు కదా, నేను ఏందీ మాట్లాడేది' అని అక్కడి నుంచి లేచి వెళ్లిపోయారు. దీంతో అక్కడున్న మిగిలిన ఎమ్మెల్యేలు కూడా ప్రెస్‌మీట్‌లో మాట్లాడలేదు. ఎవరిపాటికి వాళ్లు వెళ్లిపోయారు. ఆఖరులో మంత్రి వెళ్లారు.వాస్తవానికి వైసీపీ ఐదేళ్ల పాలనలో పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీ అగ్ర నేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి వర్గీయుల చేతిలో నలిగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా టీడీపీ కార్యకర్తను వైసీపీ కార్యకర్త హత్య చేయగలిగాడంటే అక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో పుంగనూరుకు ఎమ్మెల్యేలంతా వెళ్లి కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపాలని పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేశ్ సూచించారు. కానీ, పుంగనూరులో గురువారం జరిగిన ఎమ్మెల్యేల తీరు భరోసా కంటే నిరుత్సాహాన్నే మిగిల్చింది. కార్యకర్తల్లో భరోసా నింపుతారనుకుంటే అంతర్గత విభేదాలు బయటపెట్టుకున్నారని స్థానిక టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. కాగా, టీడీపీకి పునాదులైన కార్యకర్తలను కాపాడుకునేందుకు ఎంతదూరమైనా వెళతామని ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యేలు, నేతలతో కలిసి ఆయన రామకృష్ణ ఇంటివద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన భార్య ఉమాదేవి, కుమారులు శివ, సురేశ్ కుమార్‌లతో మాట్లాడి వారి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ భారాలను రద్దు చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన విద్యుత్‌భారాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు సుబ్రహ్మణం కోరారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపేయాలన్నారు. స్థానిక రెండో పట్టణ పరిధిలోని వంకినగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీసులు రద్దు చేసి వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేయాలన్నారు. కౌలుసవరణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీ.రమణయ్య, వెంకట్రామిరెడ్డి, శేఖరాచారి, మధు, మణి, ప్రసాద్, శ్రీనివాసులు, నారాయణ, చంద్రయ్య, వెంకట్రావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ ఈవో సనత్‌కుమార్

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో స్థానిక జడ్పీ బాలురు ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ప్రతిభ చాటడం సంతోషించ దగ్గ విషయమని డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక డిప్యూటీ ఈవో కార్యాల యంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాటా్లడుతూ ఈ నెల 20, 21 వ తేదీలలో హిమచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జాషువా అనే విద్యార్థి అండర్ -14 విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడన్నారు. అండర్-17 విభాగంలో లోకేష్ తృతీయ బహుమతిని సాధించాడని వివరించారు. దీంతో వీరిని అభినందించామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, పీడీ శివకుమార్ పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

గూడూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగర్ సమీపంలో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఇందిరమ్మకాలనీలో సాహాయేల్(19) తన తల్లి మున్నీతో కలసి నివాసం ఉంటున్నాడు. సాహాయేల్ ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 18వ తేదీ నుంచి సాహాయేల్ కనిపించకపోవడంతో అతని తల్లి మున్నీ ఈ నెల 20న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల వెనుక వైపు గ్రావెల్‌గుంతల సమీపంలో మృతిచెంది ఉన్నాడు. మృతదేహం కుళ్లిపోయి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థినికి రూ.1.20 లక్షల వితరణ



విద్యార్థినికి నగదు అందిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయరాజగోపాల్, కృష్ణారావులు

నాయుడుపేట, మార్చి 27 (ఆంధ్ర జ్యోతి) : బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న పేద విద్యార్థిని శ్రీలక్ష్మికి అమెరికాలోని బెస్టరన్నర్స్ అసోసియేషన్స్ రూ.1.20 లక్షలు ఆర్థికసాయం అందజేసింది. మునగాల కృష్ణారావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్ ద్వారా విద్యార్థినికి గురువారం నగదు అందించారు. నాయుడుపేట మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికురాలిగా పనిచేస్తున్న రాజేశ్వరి కుమార్తె శ్రీలక్ష్మి బీఎస్సీ నర్సింగ్‌లో బాగా రాణించాన్ని రోటరీ క్లబ్ గుర్తించి. ఆర్థికసాయానికి కృషిచేసింది. ఈ కార్యక్రమంలో రోటకీ క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, ట్రినిటీ చైర్మన్ నాగూరయ్య, న్యాయవాది చంద్రశేఖర్, సోమశేఖర్, కట్టా సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ విచారణ

వాకాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాకాడు ఫీల్డ్ అసిస్టెంట్ వసంతమ్మపై ఏపీడీ వరప్రసాద్ గురువారం స్త్రీశక్తి భవనంలో విచారణ చేపట్టారు. పీడీ ఆదేశాల మేరకు ఉపాధి కూలీలు, ఏపీవో విజయమ్మ, ఎంపీడీవో శ్రీనివాసులతో కలిసి విచారణ సాగించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఏపీడీ తెలియజేశారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



పొలాల్లో పడి ఉన్న పద్మయ్య నాయుడు మృతదేహం

బాలాయపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి) విద్యుత్ షాక్‌తో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. వెంగమాంబపురం గ్రామానికి చెందిన సాదనాల పద్మయ్య నాయుడు(35) గురువారం పొలానికి వెళ్లాడు. నీరు పెట్టేందుకు మోటారు వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పశువుల కాపరులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెంచుకృష్ణయ్య

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా చెంచుకృష్ణయ్య ఎంపికైనట్లు ఆ సంఘం న్యాయవాదులు తెలిపారు. గురువారం కోర్టు ప్రాంగణంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో చెంచుకృష్ణయ్య విజయం సాధించినట్లు తెలిపారు. పలువురు న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఈ

వెంకటగిరిటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పాల కేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై వచ్చిన అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోరారు. 1.46లక్షల మంది ఎస్సీ ఎస్టీలకు సోలార్ ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మిగిలిన వారికి 80శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్‌ను అమర్చుకుంటే విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, ఏడీఈఈ ముని రవిచంద్ర, ఏఈలు అశోక్ రెడ్డి, అశోక్ కుమార్, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

31 లోపు ఈకేవైసీ చేసుకోవాలి

తడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీ లోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ అండ గుండాల, మాంబట్టుల్లో రెండు చోట్ల ఆధార్ కేంద్రాలు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకొని ఈకేవైసీ పూర్తిచేయాలని తెలిపారు.

పటిష్ట బందోబస్తు నడుమ ఉరుసు

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పటిష్ట బందోబస్తు నడుమ ఉరుసు నిర్వహించనున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని హజరత్ అమీర్‌షావలి దర్గా ఉరుసును ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తుండటంతో ఆమేరకు గురువారం సీఐ ఉరుసు ప్రాంగణాన్ని పరిశీలించారు. బందోబస్తు వివరాలను నమోదు చేసుకున్నారు. సీఐ వెంట సిబ్బంది రామమోహన్‌రాజు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు గూడూరు పాతబస్టాండు నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం పాతబస్టాండు ప్రాంతం నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా 40 బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు సిబ్బంది తెలిపారు.

ఆధార్ కేంద్రంలో చోరీ

గూడూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలోని ఆధార్‌కేంద్రంలో గురువారం చోరీ జరిగినట్లు నిర్వాహకుడు వెంకటేష్ తెలిపారు. ఐరిష్ కెమెరా, తంబ్ మిషన్, ప్రింటర్ చోరీ చేశారని వాపోయాడు. సుమారు లక్ష రూపాయల విలువ చేసే వస్తువులు చోరీకి గురైనట్లు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

నవోదయకు బాలవిష్ణు



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవోలు వెంకటేశ్వర్లు, బాబయ్య

వెంకటగిరిటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొగళ్లగుంట పాఠశాలకు చెందిన ఈదురి బాల విష్ణు నవోదయకు ఎంపికయ్యాడు. ఎంఈవోలు వెంకటేశ్వర్లు , బాబయ్య అభినందించారు. ఉపాధ్యాయులు సాయిరాం, సునీతలను అభినందించారు. విద్యార్థి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి తల్లికి నేదురుమల్లి నివాళి

బాలాయపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జయంపు గ్రామ పంచాయతీకి చెందిన వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకులు వెందోటి మధుసూధన్ రెడ్డి తల్లి సుగుణమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఆమె ఉత్తర క్రియలకు వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి విచ్చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులకు సంబంధించి ప్రభుత్వం వడ్డీలో సగం రాయితీ ఇస్తోందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గురువారం కోరారు.

దారి సౌకర్యం కల్పించాలని వినతి

గూడూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపూరు గ్రామంలో తమ పొలానికి దారి చూపించాలని గ్రామస్తులు పెంచలయ్య, గురవయ్య, సునీత, శ్రీనివాసులు గురువారం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిల్లకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదలవారిపాళెం గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... ఓజిలి మండలం బత్తలాపురం గ్రామానికి చెందిన ప్రణయ్‌కుమార్ జాతరకు వచ్చి బైక్‌పై వచ్చి తిరిగి గ్రామానికి వెళుతుండగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. అతడు గాయపడ్డాడు. అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మా..కరుణించవమ్మా







గురునాథస్వామి, అంకమ్మల గ్రామోత్సవం, వేయికండ్ల కుండలతో ప్రదక్షణ చేస్తున్న భక్తులు, ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

చిల్లకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు గురువారం మూడో రోజున భక్తజనం పోటెత్తారు. జాతరకు వచ్చిన భక్తుల దాహార్తిని తీర్చేందుకు పలు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు, అంబళ్లు సరఫరా చేశారు. అంతేకాకుండా సిబ్బంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పాటకచ్చేరీ, కామెడీ షోలు, నృత్యాలు విశేషంగా ఆకట్టున్నాయి.

మొదటి విడత రీ సర్వేలో లోపాలను సరిచేస్తాం



తహసీల్దారు నుంచి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా సర్వేయర్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్

తడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తామని జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. మొదటి విడత రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలంటూ గొల్లలమలుగు గ్రామస్తులు కొద్ది రోజుల క్రితం కలెక్టర్‌ను కలసి విన్నవించారు. దీంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో గురువారం గొల్లలమలుగు గ్రామానికి జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ విచ్చేసి మొదటి విడత రీసర్వే రికార్డులను పరిశీలించారు. స్థానికుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఎటువంటి తప్పులకు తావులేకుండా పక్కాగా నిర్వహిస్తామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, సర్వే అధికారులు శ్రీరాములు, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిలో నిజాలు నిగ్గుతేల్చాలి

నాయుడుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిలో పోలీసులు నిజాలు నిగ్గుతేల్చాలని లూథరన్ చర్చి బిషప్ మైకెల్ బెన్‌హర్ అన్నారు. నాయుడుపేట గాంధీమందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు గురువారం ర్యాలీ చేపట్టారు. కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వినయ్‌కుమార్, రె.జి. రవికుమార్, సువార్తకులు జాషువ, మురళి, బెన్‌హర్, దేవరాజ్, విజయకుమార్, షబ్బీర్, పలు క్రైస్తవ సంఘాలు, ముస్లింలు పాల్గొన్నారు.

ఎస్‌వీఎస్‌ఎస్‌సీ డిగ్రీ కళాశాలకు ఏ- గ్రేడ్

సూళ్లూరుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) :సూళ్లూరుపేటలోని ఎస్వీ ఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ దక్కింది. గురువారం 2023-24, 2024-25 సంవత్సర అకడమిక్ ఆడిట్ జరిగింది. అకడమిక్ అడ్వైజర్లగా నెల్లూరు డీకేడబ్ల్యూ, శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్.వింధ్యావళి, బి.దుర్గా అనూజ కళాశాలలో అన్ని విభాగాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అత్యున్నత ప్రమాణాలు పాటిస్తుండటంతో కళాశాలకు ఏ గ్రేడ్‌ను ప్రకటించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఉషారాణి, అధ్యాపకులు డాక్టర్ వి.రాజా తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు

సూళ్లూరుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో రీసర్వే పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సర్వేశాఖ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సుద్దమడుగుతాగేలిలో పైలెట్ ప్రాజెక్టు కింద జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. సర్వేయర్లు బాలాజీ, శరత్‌కుమార్, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి ఉన్నారు.

ఒరిగిపోయిన బస్సు.. తప్పిన ప్రమాదం



సూళ్లూరుపేట మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కనుపూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎపిక్ థియేటర్ సమీపంలో పిండిపాలెం రోడ్డులో రోడ్డు పక్క గోతిలోకి ఒరిగిపోయింది. గురు వారం రాత్రి 11 గంటల సమయంలో సూళ్లూరు పేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 54 మంది ప్రయాణికులతో సూళ్లూరుపేట నుంచి పిండిపాలెం రోడ్డు మార్గంలో కనుపూరుకు బయలుదేరింది. ఎపిక్ థియేటర్ వద్ద రైల్వేగేటు దాటగానే రోడ్డుకు పక్కనే గోతిలో వెనుక టైరు దిగిపోవడంతో బస్సు ఒక్కసారిగా సగభాగం ఒరిగిపోయింది. ప్రయాణి కులు ఒక్కసారిగా భయంతో కేకలు వేశారు. డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఆర్టీసీ వారు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి ఒరిగిపోయిన బస్సును తీసేందుకు ప్రయత్నాలు చేస్తు న్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

'కనుపూరు ముత్యాలమ్మ జాతర' పుస్తకం ఆవిష్కరణ

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలోని మహాలక్ష్మమ్మగుడి ప్రాంగణంలో శుక్రవారం 'కనుపూరుజాతర' అనే పుస్తకాన్ని పలుస్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని కోటకు చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ గాది శ్రీనివాసులు రచించారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం పరిగ్రాహ్-2క25 జాతీయ సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొని పేపర్, పోస్టల్ ప్రజంటేషన్‌లు నిర్వహించారు. పది పత్రాలు ఉత్తమమైనవిగా ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు.

కోటలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలోని సచివాలయ ప్రాంగణంలో గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు పురుషులకు, మహిళలకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణలకు సంబంధించి పరీక్షలు జరిగాయి. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ గీతామణి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సర్పంచ్ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

సూళ్లూరుపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. గురువారం సూళ్లూరు పేట బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి బద్దెపూడి మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది తిరుమూరు సుధాకరరెడ్డి, కార్యదర్శిగా కే.ధర్మాప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా పిడి.బాలరాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఏ కరీం, ట్రెజరర్‌గా సి.రమేష్, లైబ్రరి కార్యదర్శిగా డి.శేషగిరిరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా ఎస్.శ్రీరాముల యాదవ్, పి.లక్ష్మయ్య, పిఎస్‌ఆర్‌వి.ప్రసాద్, సీహెచ్.మురళి, నిశాంత్ సుల్తానా, ఎన్.శ్రీనివాసులు, మహిళా ప్రతినిధిగా సౌమ్య ఎన్నికయ్యారు.

దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు, పండ్లు అందజేస్తున్న కౌన్సిలర్ షబ్బీర్

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్ర జ్యోతి) : రంజాన్ పండుగను ముస్లింలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ షేక్ షబ్బీర్ కోరారు. రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం షబ్బీర్ నివాసం వద్ద దాదాపు 300 మందికి పైగా నిరుపేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు.

ఏప్రిల్ 1న జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏప్రిల్ 1వ తేదీ జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు రెజ్లింగ్ సంఘ చైర్మన్ ఆదవరం అనుదీప్ గురువారం తెలిపారు. అండర్-15, అండర్-20 రెజ్లింగ్ జట్లను ఎంపిక చేస్తారని వివరించారు. వివరాలకు 9000024837 సంప్రదించవచ్చన్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించండి

వాకాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు అందరూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కల్లూరు సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. తాగునీటి ఎద్దడి లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. తాగునీటి ట్యాంకులను 15 రోజుల కోసారి క్లోరినేషన్ చేయాలని సూచించారు.

కులంపేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు

ఓజిలి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ జోస్యులవారికండ్రిగ ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్ వాకాటి గీతను అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చైర్మన్, కమిటీ తీర్మానం లేకుండానే పాఠశాలలో స్వీపరును నియమించుకోవడంపై ప్రశ్నించడంతో కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొంది.

కాశీ విశ్వేశ్వరా.. ఏమిటీ దైన్యం..!

- కోట్ల విలువైన మాన్యం భూములు
- అయినా నైవేద్యానికీ నిధులు కరువు
- పట్టించుకోని దేవదాయశాఖ



అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

నాయుడుపేట టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట పట్టణ పరిధిలోని పురాతన చరిత్ర గల కాశీవిశ్వేశ్వరుడి ఆలయంలో స్వామివారి నైవేద్యానికీ నిధులు కరువయ్యాయి. కోట్ల ఆస్తులున్న ఆలయ పరిస్థితి చూసి 'కాశీ విశ్వేశ్వరా ఏమిటీ దైన్యం' అని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి రాజులపాలన కాలంలో దాదాపు 500 సంవత్సరాల క్రితం వెంకటగిరి రాజావారు కాశీనుంచి స్పటిక శివలింగాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి నాయుడుపేటలోని బ్రాహ్మణ వీధిలో ప్రతిష్ఠించారు. కాలక్రమంలో ఆ ప్రాంతం ఖాళీగా ఉండటంతో కొందరికి స్థలాలు కేటాయించారు. కాశీవిశ్వేశ్వరుడి ఆలయ ప్రాంగణం మినహా మిగతా అంతా ఆక్రమణకు గురైంది.

రూ.10వేలతోనే అన్నీ..

పూజారికి ప్రతినెలా రూ.10వేలు దేవదాయ శాఖ ఇస్తుంది. ఇందులో రూ.6వేలు పూజారి జీతానికి, రూ.1300లు స్వీపర్‌కు చెల్లిస్తారు. మిగిలిన రూ.2700లతో నెల మొత్తం దేవుడికి పూలు, నూనె, తదితర పూజా సామగ్రి కొనాలి. ఈ నగదు చాలక దేవుడికి నిత్యం నైవైద్యాలు కూడా భారమయ్యాయి.

చందాలే శరణ్యం..

రెండు నెలల క్రితం ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతలు చందాలు పోగుచేసి నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పర్వదినాలలో సైతం భక్తుల చందలే శరణ్యం. ఫలితంగా ఆలయం ఎటువంటి అభివృద్ధికీ నోచుకోవడం లేదు.

కోట్ల విలువైన భూములు

నాయుడుపేట చుట్టుపక్కల ప్రాంతాలలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆల యానికి కోట్లాది రూపాయల విలువచేసే భూములు ఉన్నాయి. విన్నమాల గ్రామంలో 25.73 ఎకరాలు, మాంబట్టులో 2.35 ఎకరాలు, తుమ్మూరులో 3.42 ఎకరాలు, జోశ్యులవారికండ్రిగలో 1.20 ఎకరాలు, చిల్లకూరులో 1.50ఎకరాలు, ఏడూరులో 0.98 సెంట్లు, పుంజులూరుపాడులో 0.98 సెంట్లు మాన్యం భూములు.. మొత్తంగా 36.16 ఎకరాలు మాన్యం భూములు ఉన్నాయి.

వేలంలో మతలబు ఏమిటో..!

దేవదాయ శాఖ పర్యవేక్షణ కొరవడడంతో మాన్యం భూముల కౌలు ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. ఎకరాకు రూ.10వేలు మాత్రమే కౌలుదారులు చెల్లిస్తున్నారు. ఈ భూములకు పక్కనే ఉన్న రైతుల భూములకు రూ.25వేలు చెల్లిస్తున్నారు. మరి ఈ తేడాలో మతలబు ఏమిటో దేవదాయ శాఖకే తెలియాలి.



ఆలయ మాన్యం భూములు

కౌలు నగదు ఏమైంది?

మాన్యం భూములకు మూడేళ్లకు ఒకసారి వేలం నిర్వహిస్తారు. ఎకరాకు రూ.10వేలు చొప్పున 36 ఎకరాలకు గాను ఏడాదికి రూ.3లక్షలా 60వేల ఆదాయం వస్తుంది. ఈ నగదును స్థానిక స్టేట్ బ్యాంకులో ఆలయ ఖాతాలో జమచేస్తారు. ఈ నగదుపై వచ్చే వడ్డీతోనైనా ఆలయంలో నైవేద్యాలకు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు. అలాగే భూముల వేలం పారదర్శకంగా నిర్వహించి ఆదాయం పెంచుకోవాలని పేర్కొంటున్నారు. ఈ దిశగా దేవదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నారు.

వేలం పాటల్లో పోటీతత్వం లేదు

అన్నపూర్ణాదేవి కాశీవిశ్వేశ్వర ఆలయ మాన్యం భూముల వేలం పాటలలో పోటీతత్వం లేకపోవడంతో లీజులు తక్కువగా ఉంది. ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- రవికృష్ణ, ఆలయ ఈవో